
సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 6-6-2025 15/-

# ఆర్థిక వ్యవస్థ

## హజ్ యాత్ర పరమార్థం




రచయితలకు, పాఠకులకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు **ఈదుల్ అజ్‌హా** శుభాకాంక్షలు!

సహజీవన భావాల పావురాయి
గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 22 హైదరాబాద్
శుక్రవారం 6 జూన్ 2025 రూ.15-00
9 జిల్‌హజ్జ 1446 హిజ్రీ


**తొలిగీటు**

**ఎవరైతే తన సోదరుని అవసరాన్ని తీరుస్తారో, అల్లాహ్ అతని అవసరాన్ని తీరుస్తాడు.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com





## లోపల...


| | | |
|---|---|---|
| విదేశీ వస్తు బహిష్కరణ | ...... | 04 |
| ఆర్థిక వ్యవస్థ | ...... | 05 |
| చరితార్థులు-2 : బేగం అతియా ఫైజీ | ...... | 09 |
| ఉగ్రవాదానికి తలవంచని భారత్ | ...... | 10 |
| మతానికి అతీతమైన భాష ఉర్దూ..... | ...... | 12 |
| హజ్‌యాత్ర పరమార్థం | ...... | 14 |
| పర్యావరణాన్ని కాపాడుకుందాం! | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| ఔలియా అల్లాహ్ ఎవరు? | ...... | 24 |
| కవలల 'వైద్య' విజయం.... | ...... | 27 |
| ఆర్థిక వికేంద్రీకరణ సమాజానికి అవసరం | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| విటమిన్-డి | ...... | 34 |


**నువ్వు మామూలోడివి కాదు**




(AI టెక్నాలజీతో మహానాడులో దివంగత ఎన్టీఆర్ ప్రసంగం)

అంగరంగ వైభవంగా
జరిగింది మహానాడు
అబద్ధాలు అల్లడంలో
నిను మించినోడు లేడు!
కృత్రిమ మేధస్సుతోని
అద్రింది అన్న ప్రసంగం
ప్రజల్ని ఏమార్చడమే
చంద్రబాబు వ్యాసంగం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## విదేశీ వస్తు బహిష్కరణ

గుజరాత్ సభల్లో మాట్లాడుతూ మోడీ చెప్పిన రెండు మాటలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. ఒక రోజు ఆయన మాట్లాడుతూ దేశం అద్భుతమైన ప్రగతి సాధించిందని, అన్ని ఉత్పత్తులు దేశం లోనే జరుగుతున్నాయని, మన ఉత్పత్తులు ప్రపంచంలో వివిధ దేశాలకు వెళుతున్నాయని అన్నారు. స్మార్ట్ ఫోన్ మొదలు కార్లు, ఆటబొమ్మలు, మిలిటరీ ఆయుధాలు, ఔషధాలు ఇవన్నీ మనమే తయారు చేసుకోవడమే కాదు, ఎగుమతులు కూడా చేస్తున్నామని చెప్పారు. చాలా సంతోషించవలసిన విషయం.

కాని మర్నాడే ఓ సభలో మాట్లాడుతూ దేశంలో విదేశీ వస్తువులను ఉపయోగించడం పెరిగిపోతుందని, వ్యాపారులు ఎంత లాభం వచ్చినా సరే విదేశీ వస్తువులు అమ్మరాదని, ఆటబొమ్మలు, గుండుసూదులు మాత్రమే కాదు చివరకు గణేష్ విగ్రహాలు, హోలీ రంగులు కూడా చైనా నుంచే వస్తున్నాయని అన్నారు. అంతేకాదు, దేశ ప్రజలకు ఒక టాస్క్ కూడా ఇచ్చారు. రోజూ ఎన్ని విదేశీ వస్తువులు ఉపయోగిస్తున్నారో ఒక జాబితా తయారు చేసి చూడండన్నారు. పిన్నులు, దువ్వెనలు, నోరుశుభ్రం చేసుకునే పుల్లలు అన్నీ విదేశీ వాడేస్తున్నామని, ఈ విదేశీ వస్తువులన్నీ ఎప్పుడు ఎలా చొచ్చుకువచ్చేసాయో తెలియకుండానే వాడేస్తున్నా మని అన్నారు. ఆయన చెబుతున్నది చైనా వస్తువుల గురించి అన్నది అర్థమవుతూనే ఉంది. ఎందుకనో ప్రధాని మోడీ చైనా పేరు ఇలాంటి సందర్భాల్లో తన నోట పలకరు. చైనా వస్తువులు మార్కెటును ముంచెత్తుతున్నాయన్నది సాధారణ ప్రజలకు తెలియదేమో కాని ప్రభుత్వానికి తెలియకపోవడమేమిటి? ప్రభుత్వ అనుమతులు లేనిదే చైనా వస్తువులు మన మార్కెటుకు వస్తున్నాయా? అసలు విదేశీ వస్తువులను ప్రభుత్వమే అడ్డుకుంటే ఈ వస్తువులు మార్కెటులో కనిపిస్తాయా?

ఆలోచించవలసిన విషయమేమిటంటే, ప్రధాని చెప్పిన రెండు మాటల్లో ఏది నిజం? మే 26వ తేదీ ప్రసంగంలో ఆయన చెప్పినట్లు దేశంలో అనేక వస్తువులు ఉత్పత్తవుతున్నాయన్నది నిజమా లేక మే 27న ఆయన చెప్పినట్లు విదేశీ వస్తువులు మార్కెటును ముంచెత్తుతున్నాయన్నది నిజమా? ఏది నిజం?

భారతదేశానికి, చైనాకు మధ్య ట్రేడ్ డెఫిసిట్ మన్మోహన్ కాలంలో అంటే 2013లో 29 బిలియన్ డాలర్లు. ఇప్పుడు ఈ డెఫిసిట్ 99 బిలియన్ డాలర్లు. అంటే మూడు రెట్లు పెరిగింది.

చైనా నెమ్మదిగా మన మార్కెటును ఆక్రమించుకుంది. గాలిపటాలు ఎగరేసే దారాలు మొదలు, ఆటబొమ్మలు, గోడకు దిగ్గొట్టే మేకులు...ఒక్కటేమిటి అన్నీ చైనా ఉత్పత్తులే మార్కెటులో దొరుకుతున్నాయి. ఇదంతా మోడీ గారి కాలంలోనే జరిగింది కదా.

మోడీ ప్రభుత్వ అనుమతి లేకుండా ఈ వస్తువులు దిగుమతి ఎలా అవుతాయి? దేశ ప్రజలు విదేశీ వస్తువులను బహిష్కరించాలని అప్పీలు చేయవలసిన అవసరం ప్రభుత్వానికి ఉండదు. ప్రభుత్వం తలచుకుంటే విదేశాల నుంచి ఏ వస్తువూ మన మార్కెటుకు రాదు. గాంధీజీ విదేశీ వస్తు బహిష్కరణ చేసినప్పుడు మన దేశాన్ని బ్రిటీషు వారు పాలించేవారు. కాబట్టి ప్రజలు పూనుకుని విదేశీ వస్తువులను బహిష్కరించవలసి వచ్చింది. నేడు స్వతంత్ర భారతదేశం. మన ప్రభుత్వం తలచుకుంటే విదేశీ వస్తువులు కాదు కదా విదేశీగాలి కూడా సరిహద్దులు దాటి లోపలికి రాలేదు.

ప్రధాని మోడీ విదేశీ వస్తువుల గురించి విమర్శలు సంధించిన వెంటనే కాంగ్రెస్ మోడీ గారి కొన్ని పాత ఫోటోలు షేర్ చేసింది. ఆ ఫోటోల్లో అమెరికా కంపెనీ బాస్ తయారు చేసిన హెడ్ ఫోన్లు పెట్టుకున్న మోడీగారు, జర్మనీ కంపెనీ మే బాక్ తయారు చేసిన సన్ గ్లాసెస్, అలాగే ఇటలీ తయారీ బుల్గారీ సన్ గ్లాసెస్, స్విట్జర్లాండ్ తయారీ మోవాడో వాచ్, జర్మనీ తయారీ మాంట్ బ్లాంక్ పెన్ను వాడుతున్న మోడీ గారి చిత్రాలను షేర్ చేసింది. అంతేకాదు ఐ ఫోన్ వాడుతున్న మోడీ ఫోటో కూడా షేర్ చేసింది. ఇంకా చెప్పాల్సి వస్తే మోడీ గారు వాడే కారు, విమానాలు ఇవన్నీ విదేశీయే కదా అంటున్నారు జనం.

భారత ప్రధానిగా లాల్ బహదూర్ శాస్త్రి ఉన్నప్పుడు ఇండో పాకిస్తాన్ యుద్ధం జరిగింది. దేశంలో ఆహారకొరత ఏర్పడింది. దేశంలో ప్రజలు ఒక్కపూట మాత్రమే భోజనం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే ఈ పిలుపు ఇచ్చే ముందు ఆయన తన కుటుంబంలో భార్యాపిల్లలు అందరూ ఒక్కపూట మాత్రమే భోజనం చేసేవారు. ఆయన ఆచరించి ప్రజలకు ఇచ్చిన పిలుపు అది. వెంటనే ప్రజలు ప్రతిస్పందించారు.

ప్రధానిగా మోడీ స్వదేశీ వస్తువులను, స్వదేశీ కార్లు, మొబైల్ ఫోన్లు మొదలైనవి ఉపయోగిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలబడితే ప్రజలు కూడా ఆయన చెప్పినట్లు విదేశీ వస్తువులను వాడడం మానేస్తారు. అలాగే ఈ విదేశీ వస్తువులు మన మార్కెటును ముంచెత్తకుండా అనుమతులు ఆపేస్తే, తగిన కట్టడి చేస్తే దేశంలో పరిశ్రమలు పుంజుకుంటాయి, ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.

అబ్దుల్ వాహెద్




# ఆర్థిక వ్యవస్థ

**భారతదేశం ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని ప్రధాని మోడీ సగర్వంగా ప్రకటించారు. జపాన్‌ను భారతదేశం అధిగమించిందని అన్నారు. తాను ప్రధానిగా 2014 మే 26న పదవీ బాధ్యతలు స్వీకరించిన అప్పుడు ఇండియా 11వ స్థానంలో ఉండేదని, ఇప్పుడు నాల్గవ స్థానానికి చేరుకుందని, ఇది భారతీయులకు గర్వకారణమని అన్నారు.**

అంతకు ముందు నీతి ఆయోగ్ సియిఓ సుబ్రహ్మణ్యం పత్రికా సమావేశంలో మాట్లాడుతూ భారతదేశం జపాన్ ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు 4 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ అయ్యిందన్నారు. సుబ్రహ్మణ్యం ఐఎంఎఫ్ డాటా ఆధారంగా ఈ మాటలు చెబుతున్నానన్నారు. మరికొంత కాలం ఇలాగే ప్రయత్నిస్తే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిపోతామని చెప్పారు.

ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్, మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్ర, ఆర్పీజీ గ్రూప్ చైర్మన్ హర్ష్ గోయంకా తదితరులు అందరూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

కాని –

నీతి ఆయోగ్ సభ్యుడు అరవింద్ విర్మానీ ఈ విషయమై మాట్లాడుతూ భారతదేశం నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా త్వరలో మారబోతోంది, 2025 చివరినాటికి నాల్గవ అతిపెద్ద

ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది అన్నారు. అంటే ఆయన ప్రకారం ఇంకా భారతదేశం నాల్గవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారలేదు. ఈ సంవత్సరం చివరి నాటికి మారవచ్చు.

సరే, ఈ సంవత్సరంలో ఇంకా మిగిలి ఉన్నవి కేవలం ఐదారు నెలలే కాబట్టి భారతదేశం నాల్గవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారడం ఖాయంగానే భావించాలి. ఇది పెద్ద విజయంగానే చెప్పాలి.

ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెప్పుకోవడం ఎంత గర్వకారణం? ప్రపంచంలో వివిధ దేశాల్లో తిరుగుతూ వ్యాపారాలు చేసేవారికి, లేదా అంతర్జాతీయంగా పర్యటనలు చేసేవారికి ఇది చాలా గర్వకారణం. సంబరాలు చేసుకునే సందర్భమే. కాని బిజినెస్ పత్రికలు ఈ వార్తకు పెద్దగా ప్రాముఖ్యం ఎందుకు ఇవ్వలేదు? పల్లెల్లో వ్యవసాయ పనులు చేసుకునే రైతు లేదా కూలీ బతుకులో ఏమైనా మార్పు వచ్చిందా? తలసరి ఆదాయంలో మార్పు వచ్చిందా? రైతుల ఆదాయం రెట్టింపయ్యిందా? జపాన్ తలసరి ఆదాయంతో పోల్చితే మనదేశంలో తలసరి ఆదాయం ఎంత ఉంది?

ఇలాంటి కొన్ని ప్రశ్నలు కొన్ని సందర్భాల్లో అడగడం కొంతమందికి రుచించకపోవచ్చు. అందరు సంతోషంగా నాల్గవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ అనే సంబరాల్లో ఉన్నప్పుడు పానకంలో పుడకలా ఈ ప్రశ్నలేమిటని కొందరు చికాకు పడవచ్చు. కాని ఇవి ఇప్పుడు అడగవలసిన ప్రశ్నలే. దేశం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారినా లేక మూడవ, రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారినా సగటు మనిషి బతుకు ఎలా ఉందనేదే ముఖ్యమైన ప్రశ్న. ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి సాధిస్తుంటే మరో వైపు సగటు మనిషి బతుకులో మార్పు లేకపోవడం అర్థం కాని విషయం.

ప్రధాని మోదీ తన ప్రసంగంలో మాట్లాడుతూ తాను అధికారంలోకి వచ్చినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలో ఉండేదన్నారు. అది నిజమే. ఈ పదేళ్ళలో భారతదేశ ఆర్థికవ్యవస్థ పరిమాణంలో పెరుగుదల రెండు ట్రిలియన్ డాలర్లు. రెండు ట్రిలియన్ డాలర్ల పెరుగుదల నమోదు చేయడానికి పదేళ్ళ కాలం పట్టింది. జర్మనీ ఆర్థిక వ్యవస్థ పరిమాణం కూడా అంత పెద్దదేం కాదు. 4.74 ట్రిలియన్లు. కాబట్టి జర్మనీని దాటిపోవడం కూడా కష్టమేమీ కాదు. కాని 18.75 ట్రిలియన్ ఎకానమి ఉన్న చైనా, 29.18 ట్రిలియన్ ఎకానమీ ఉన్న అమెరికాలను దాటడానికి చాలా సమయం పడుతుందన్నది సగటు హైస్కూలు విద్యార్థికి కూడా అర్థమయ్యే లెక్క.

దాదాపు 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోడానికి అమెరికాకు ఎంత సమయం పట్టింది. రెండవ స్థానంలో ఉన్న చైనా దాదాపు 19 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవడానికి ఎంత కాలం పట్టింది? ఇవి ముఖ్యమైన ప్రశ్నలు.

నిజం చెప్పాలంటే ఒక విచిత్రమైన పరిస్థితి మనకు కనిపిస్తుంది. ప్రపంచదేశాల ఎకానమీ ర్యాంకింగులో కెనడా పదవస్థానంలో ఉంది. ఆస్ట్రేలియా 13వ స్థానంలో ఉంది. ఈ రెండు దేశాల కన్నా మెరుగైన స్థానంలో బ్రెజిల్ 9వ స్థానంలో ఉంది. ఇంకా ఎక్కడో దిగువన 27వ స్థానంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉంది. దానికన్నా కాస్త పైన సౌదీ అరేబియా 19వ స్థానంలో ఉంది.

పదవ స్థానంలో ఉన్న కెనడాకు, 19వ స్థానంలో ఉన్న సౌదీ అరేబియాకు, 27వ స్థానంలో ఉన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు మనం ఉద్యోగాలు వెదుక్కుంటూ వెళ్ళే పరిస్థితి ఎందుకు ఉంది? కెనడా, సౌదీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్... ఈ ర్యాంకింగులో పది కన్నా క్రింది స్థానాల్లో ఉన్న ఈ దేశాల ప్రజలు తమ దేశం వదిలి ఉద్యోగాల కోసం వేరే దేశాలకు వెళుతున్నారా?

మరో విచిత్రమైన పరిస్థితి... ఈ ర్యాంకింగులో బ్రెజిల్ కెనడా కన్నా మెరుగైన స్థానంలో ఉంది. ఉద్యోగాల కోసం, పని కోసం విదేశాలకు వెళ్ళేవారు కెనడా, బ్రెజిల్ – ఈ రెండు దేశాల్లో దేనికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు?

ప్రస్తుతం భారత ఆర్థికవ్యవస్థకు, జపాన్ ఆర్థిక వ్యవస్థకు మధ్య పెద్ద తేడా లేదు. భారతదేశం జపాన్ను అధిగమించడం కష్టం కాదు. మరో విధంగా చెప్పాలంటే జపాన్ ఆర్థికవ్యవస్థ తీవ్రమైన కష్టాల్లో కూరుకుపోయి ఉంది. పతనమవుతోంది. అందువల్ల జపాన్ను అధిగమించడం మనకు సులభమయ్యింది. భారతదేశం అసాధారణ ప్రగతి నమోదు చేసి 6 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారి ఉంటే నిజంగానే గొప్ప విజయం సాధించామని చెప్పుకోగలిగేవాళ్ళం. కాని జరిగిందేమిటంటే, జపాన్ ఆర్థిక వ్యవస్థ 6 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవలసింది, కష్టాల్లో కూరుకుని 4 ట్రిలియన్ డాలర్లకు పడిపోయింది. ఈ విషయాన్ని జపాన్ ప్రధానమంత్రి స్వయంగా ఒప్పుకున్నారు. తమ దేశ ఆర్థికవ్యవస్థ గ్రీసు కన్నా ఘోరమైన స్థితికి చేరుకుంటుందని చెప్పారు. ఆర్థిక మాంద్యంలో చిక్కుకుందన్నారు. ఏది ఏమైనా భారతదేశం ఇలాంటి ఆర్థిక మాంద్యం స్థితికి చేరుకో లేదు.

ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉండడం వల్ల మనం జపాన్ను అధిగమించగలిగాము.

జపాన్‌ను అధిగమించడం ప్రస్తుత పరిస్థితిలో భారతదేశానికి కష్టమేమీ కాదు, ఎందుకంటే భారత జీడీపీ వృద్ధి ఇప్పుడు 6.3 శాతం అయితే కష్టాల్లో పీకల్లోతు మునిగిపోయిన జపాన్ జీడీపీ 0.6 శాతం. జిడిపీ వృద్ధిరేటులో ఇంత తేడా ఉన్నప్పుడు జపాన్‌ను అధిగమించడం కష్టమా?

కాని గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే, జపాన్ జనాభా 12.3 కోట్ల మంది మాత్రమే. అక్కడ తలసరి ఆదాయం 33900 డాలర్లు అంటే దాదాపు 30 లక్షల రూపాయలు. భారతదేశంలో జనాభా 146 కోట్ల మంది. ఇక్కడ తలసరి ఆదాయం 2880 డాలర్లు. అంటే దాదాపు రెండున్నర లక్షల రూపాయలు. కాబట్టి జపాన్ తో పోటీ సాధ్యం కాదు.

ఇక్కడ కాస్త చైనా పరిస్థితిని కూడా పరిశీలించాలి. ఎందుకంటే చైనా కూడా అత్యధిక జనాభా కలిగిన దేశం. చైనా 2008లో 4 ట్రిలియన్ మార్కును దాటేసింది. అప్పట్లో చైనా తలసరి ఆదాయం దాదాపు 3,500 డాలర్లు. అంటే దాదాపు మూడు లక్షల రూపాయలు. ఆ తర్వాత చైనా శరవేగంగా అభివృద్ధి నమోదు చేసింది. పదిహేనేళ్ళ కాలంలో జిడిపి దాదాపు మూడు రెట్లు పెరిగింది. తలసరి ఆదాయం కూడా 12000 డాలర్లు అంటే పదిలక్షల రూపాయల కన్నా ఎక్కువ. అంటే మూడు రెట్లు పెరిగింది.

ఇప్పుడు భారతదేశ ఎకానమీ 4 ట్రిలియన్ డాలర్ల మైలురాయిని దాటేయబోతోంది. 2004లో దేశంలో తలసరి ఆదాయం కేవలం 620 డాలర్లు. 2024 నాటికి అది దాదాపు నాలుగురెట్లు పెరిగింది. ఈ వృద్ధి రేటు నిలకడగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థను సూచిస్తుంది.

కాని – ఈ సంవత్సరం ఏప్రిల్‌లో రిజర్వు బ్యాంకు భారత జీడీపీ అంచనాలను 6.7 శాతం నుంచి 6.3 శాతానికి తగ్గించింది. మూడీ రేటింగ్ ఏజెన్సీ కూడా జీడీపీ అంచనాను 6.3 శాతానికి తగ్గించి చూపించింది. జీడీపీ వృద్ధి రేటు తగ్గుతుందనే అంచనాలున్నాయి. మరోవైపు ప్రజల్లో క్రయశక్తి లేదు. కొనుగోళ్ళు తగ్గుతున్నాయి. రిజర్వు బ్యాంకు రెపోరేటు తగ్గించి ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి ప్రయత్నిస్తుంది. ఏప్రిల్ నెలలో వచ్చిన ఒక వార్త ప్రకారం భారతదేశంలో హౌస్ హోల్డ్ రుణాలు 37.6 శాతం నుంచి 42.9 శాతానికి పెరిగాయి. వ్యక్తిగత రుణాలు పెరుగుతున్నాయి. అంటే అర్థమేమిటి, సంపాదన తగ్గుతోంది, రుణాలపై ఆధారపడే పరిస్థితి వస్తోంది. ఇంటి ఖర్చుల కోసం అప్పులు చేసే పరిస్థితి. మైక్రోఫైనాన్స్ రంగంలోనూ సమస్యలు తలెత్తుతున్నాయి.

దేశంలో పరిస్థితి ఇలా ఉన్నప్పుడు, మనం జపాన్, జర్మనీలను దాటిపోయినా తలసరి ఆదాయం పెంచడంలో, ప్రజల కొనుగోలు శక్తిని పెంచడంలో విఫలమైతే ప్రయోజనమేమిటి? జపాన్ ఆర్థికంగా కుదేలవుతున్న విషయం వాస్తవమే, జపాన్ ఆర్థికవ్యవస్థ పతనమై 6 నుంచి 4 ట్రిలియన్ డాలర్లకు పడిపోయిందన్నది కూడా వాస్తవమే. జీడీపీ వృద్ధి రేటు ఒక్క శాతం కూడా లేదన్నది కూడా వాస్తవమే. కాని జపాన్ పేరు చెప్పగానే ఇప్పుడు కూడా హై స్పీడ్ రైలు, వ్యాపార కేంద్రాలు, సైన్సు టెక్నాలజీ ప్రగతి వికాసాలు మన కంటి ముందుకు వస్తాయి. భారతదేశం 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారి నప్పటికీ ఇక్కడి ప్రజల స్థితిగతుల్లో ఏమైనా మార్పు వచ్చిందా?

ప్రపంచ ఆర్థిక అసమానతల రిపోర్టు 2022 ప్రకారం భారతదేశంలో కేవలం 1 శాతం కుబేరుల వద్ద దేశంలోని 40 శాతం సంపద ఉంది. దేశంలోని 50 శాతం ప్రజల వద్ద దేశసంపదలో కేవలం 3 శాతం మాత్రమే ఉంది. దేశంలో కేవలం 10 శాతం మంది సంపాదన మాత్రమే జాతీయ ఆదాయాల్లో 57 శాతం ఉంది.

టైమ్స్ ఆఫ్ ఇండియా మే 20, 2022 పత్రికలో వార్త ప్రకారం దేశంలో నెలకు పాతికవేల రూపాయల ఆదాయం ఉన్నవారు కేవలం పదిశాతం మంది మాత్రమే. భారతదేశంలోని ఆదాయ అసమానతలు చాలా తీవ్రంగా ఉన్నాయి. దేశంలో సంపద కొందరి వద్దనే పోగుపడి ఉంది. ఇలాంటి పరిస్థితిలో జీడీపీ లెక్కలను ఎలా అర్థం చేసుకోవాలి. దేశసంపదలో 40 శాతం తమ చేతుల్లో ఉంచుకున్న 1 శాతం కుబేరులను లెక్కలోకి తీసుకోకపోతే జీడీపీ చాలా కిందికి పడిపోతుంది. దాంతో పాటు తలసరి ఆదాయం కూడా చాలా పడిపోతుంది. అలాగే దేశసంపదలో 62 శాతం కేవలం 5 శాతం కుబేరుల వద్ద ఉంది. జీడీపీ లెక్కల్లో వీరిని తప్పిస్తే అప్పుడు జిడిపి మరింత పడిపోతుంది. తలసరి ఆదాయం ఏడాదికి లక్ష రూపాయలు కూడా లేని పరిస్థితి కనిపిస్తుంది. ఇదే అసలు మన దేశ ఆర్థిక స్వరూపం. అందువల్లనే దేశంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇవ్వవలసిన పరిస్థితి ఉంది.

దేశంలో జీడీపీ లెక్కల్లో పెరుగుదల నమోదు చేయడానికి కారణమైన ఐటి, ఫైనాన్స్, ఈ కామర్స్, కార్పోరేట్ రంగాలు నిజానికి ఉద్యోగాలను కల్పిస్తున్నది తక్కువే. దేశంలో అత్యధిక శాతం ప్రజలు అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్నారు. దాదాపు 50 శాతం జనాభా వ్యవసాయపనులు చేసుకుంటున్నారు. జిడిపిలో వ్యవసాయోత్పత్తులు 18 శాతం మాత్రమే. జీడీపీలో 50 శాతం వరకు ఉన్న ఐటి, ఫైనాన్స్ వంటి రంగాల్లో పనిచేస్తున్నవారు 30 శాతం కూడా ఉండరు. ఈ రంగాల్లో కూడా లాభాలు తగ్గుతున్నాయి. జీతాలు పెరగడం లేదు. ఉద్యోగాల్లో కోతలు పెడుతున్నారు.

ఇది కేవలం భారతదేశంలో సమస్య మాత్రమే అనుకుంటే పొరబాటు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎకానమీ అమెరికాలో కూడా ఈ సమస్య ఉంది. అక్కడ తలసరి ఆదాయం 89 వేల డాలర్లు. అయినా దాదాపు 4 కోట్ల మంది అమెరికన్లు పేదరికంలో బతుకుతున్నారు. తల దాచుకోడానికి గూడు, వైద్యసదుపాయాలు లేకపోవడం కనిపిస్తాయి. ఈ సమస్యల వల్లనే ట్రంప్ ట్రేడ్ పాలసీలు మార్చుతానని అంటున్నారు.

ప్రపంచంలో నాల్గవ ఆర్థికవ్యవస్థగా మారడం, మూడవ ఆర్థికవ్యవస్థగా మారడం వంటి మైలురాళ్ళు ఎన్ని దాటినా ప్రజల బతుకుల్లో మార్పు కనిపించకపోతే ప్రయోజనం ఉండదు. నేర్చుకోవలసిన పాఠం ఏమిటంటే ఆర్థిక ప్రగతి సంపద పంపిణీ వ్యవస్థ లేకుండా కేంద్రీకృతమైపోతే దానివల్ల కొందరు కుబేరులకు తప్ప మరెవ్వరికీ ప్రయోజనం ఉండదు. తీవ్రమైన అసమానతలు కనిపిస్తున్నప్పుడు వాటిని పరిష్కరించడానికి ప్రయత్నించాలి. దేశం సంపన్న దేశంగా మారి, ప్రజలు నిరుపేదలుగా మిగలడం వల్ల దేశానికి ప్రయోజనం ఉండదు. నిజానికి కొందరు కుబేరులకు తప్ప మరెవ్వరికీ ప్రయోజనం ఉండదు. ఇది నిజానికి బలుపు కాదు వాపు. కొందరు కుబేరుల ఆస్తులు పెరగడం వల్ల జరిగేదేమిటంటే, తమకు అనుకూలమైన విధాన నిర్ణయాలు, పన్నులు, శిస్తుల నిర్ణయాలు తీసుకునేలా ప్రభుత్వం ఒత్తిడి తీసుకువస్తారు. అమెరికాలో కూడా కుబేరులపై పన్నులు తక్కువే. జీడీపీలో ప్రథమస్థానంలో ఉన్నా అమెరికాలో పేదల బతుకులు దుర్భరమే.

ఈ పరిస్థితి మారాలంటే సంపద పంపిణీ ఏర్పాట్లు ఉండాలి. సంపద పంపిణీ గురించి ఆలోచిస్తున్నప్పుడు తప్పకుండా ఇస్లాం ప్రతిపాదించే ఆర్థికవ్యవస్థ గుర్తుకు వస్తుంది. ఏటా 2.5 శాతం తప్పనిసరిగా పంపిణీ చేసే జకాత్ వ్యవస్థ అయినా, వడ్డీ నిషేధ మైనా, వక్ఫ్ ఏర్పాటైనా – ఇవన్నీ సంపద పంపిణీకి, ఇన్ ఫ్రాస్టక్చర్ ఏర్పాట్లకు ఉపయోగపడేవి. వీటన్నింటి గురించి పునరాలోచించ వలసిన అవసరం నేడు ఎంతైనా ఉంది. ✤


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com


‘చరితార్థులు’-2



# బేగం అతియా ఫైజీ

## (1877 -1967)

82




**మహిళలకు** ఆధునిక విద్య, ఆచార సంప్రదాయాలలో సంస్కరణ, సాంఘిక–రాజకీయ–విద్యా సంస్థలలో భాగస్వామ్యం డిమాండ్ చేస్తూ జాతీయోద్యమంలో ప్రత్యక్ష పాత్రను నిర్వహించిన మహిళా నేత బేగం అతియా ఫైజీ 1877లో టర్కీ దేశంలోని ఇస్తాంబుల్‌లో జన్మించారు. ఆమె తండ్రి హాజి అలీ హుస్సేన్, తల్లి అమీరున్నిసా. చిన్నతనంలోనే అతియా బేగం ముంబాయి వచ్చేశారు. ప్రభుత్వ ఉపకార వేతనంతో ఉన్నత చదువులకు లండన్ వెళ్ళిన ఆమె పలు భాషలలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. అన్ని రంగాలలో మహిళల అభ్యుదయాన్ని ఆకాంక్షిస్తూ మహిళా సంఘాల స్థాపనతోనూ, ఇతర మహిళా సంస్థలలో చురుగ్గా పని చేస్తూ వచ్చిన అతియా బేగం మహాత్మాగాంధీ కార్యాచరణ పట్ల ఆకర్షితులయ్యారు. స్వదేశీ ఉద్య మంలో క్రియాశీలకంగా పాల్గొన్న ఆమె అత్యంత విలువైన విదేశీ వస్త్రాలను, వస్తువులను దహనం చేసి ఖద్దరు ధరించారు. ఖద్దరు ఉద్యమంలో భాగంగా ఇంటింటా రాట్నం ఏర్పాటు చేసి గృహిణుల చేత నూలు వడికించారు. ఖద్దరు ధారణ చేయించారు. ఖద్దరు భాండా గారాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఖద్దరును అందుబాటులోకి తెచ్చారు. ఈ మార్పుకోసం ఆమె అవిశ్రాంతంగా పర్యటనలు చేస్తూ సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తూ, ప్రచారదళాలను నిర్మించి మహిళలకు స్వదేశీ–ఖద్దరు ఉద్యమాన్ని ఆచరణాత్మ కంగా పరిచయం చేశారు. ఆ కారణంగా మహాత్ముడు పలుమార్లు అతియా కృషిని బహిరంగంగా ప్రశంసించారు. 1919 నాటి ఖిలాఫత్–సహాయ నిరాకరణ ఉద్యమంలో ఆమె చురుగ్గా పాల్గొన్నారు. మహాత్ముని సూచనల మేరకు అతి స్వల్పకాలంలో లక్ష రూపాయల ‘తిలక్ ఫండ్’ సేకరించి అందించారు. 1921లో వేల్స్ రాకుమారుడి రాక సందర్భంగా నిరసన వ్యక్తం చేస్తూ సభలు, సమావేశాలు నిర్వహించారు. జాతీయోద్యమ కార్యక్రమాలన్నిటిలో పాల్గొంటూ వచ్చిన అతియా బేగం భారతీయ సంగీతం గురించి ప్రసంగాలు చేయడం మాత్రమే కాకుండా పలు ప్రామాణిక గ్రంథాలను కూడా వెలువరించి, అనాటి ప్రముఖ రచయితల, విమర్శకుల ప్రశంసలను అందుకున్నారు. మొదటి రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరై ఇండియా తిరిగి వస్తున్న మహాత్మాగాంధీ ప్రయాణిస్తున్న నౌకలో ఆమె కూడా ప్రయాణించి తన అటోగ్రాఫ్ పుస్తకంలో ఆయన సంతకంతో పాటుగా ఆయన రక్తపు బొట్టు మరకను కూడా స్వీకరించి అందరిని ఆశ్చర్యచకితుల్ని చేశారు. భారత విభజన తరువాత పాకిస్తాన్ వెళ్ళిన అతియా ఫైజీ బేగం 1967 జనవరి నాలుగున కరాచీలో కన్నుమూశారు. ✤



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **‘చరితార్థులు’ - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



# ఉగ్రవాదానికి తలవంచని భారత్

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

ఈనాడు ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యల్లో 'ఉగ్రవాదం' ముఖ్యమైనది. మట్టిలో కలిసిపోయిన అమాయకుల శరీరాలు, ప్రాణాలు కోల్పోయిన చిన్నారులు, తల్లిని కోల్పోయిన పిల్లలు, దేశాన్ని భయకంపిత మయ్యేలా చేయాలన్న కుయుక్తి– ఇది టీవీ డిబేట్లలో మాట్లాడుకునే రాజకీయ సమస్య కాదు. ఇది నిత్యం మన సరిహద్దుల్లో, నగరాల్లో, నిశ్శబ్దంగా విరుచుకు పడే ఉగ్రపీడ.

అట్లాంటిక్ గగనతలంలో 1985లో జరిగిన 'ఎయిర్ ఇండియా కనిష్క్' పేలుడు నుంచి... మొన్నటికి మొన్న బైసరాన్ లోయలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి వరకు, ఈ దేశం ఎన్నో చీకటి దుర్మార్గాలను చూసింది, తట్టుకుంది. భారతదేశంపై ఉగ్ర దాడులు యాదృచ్ఛికంగా జరగలేదు. అవి ఎంతో పకడ్బందీగా, పథకం ప్రకారం జరిగాయి. 1991లో రాజీవ్ గాంధీ హత్య, 1993 ముంబయి పేలుళ్లు, 2001లో పార్లమెంటుపై దాడి, 2008లో ముంబయి 26/11 ఉగ్రహత్యలు, ప్రతి దాడి మన దేశ మనోబలాన్ని పరీక్షించాయి.

## కానీ మనం తలవంచలేదు. తలెత్తుకుని నిలబడ్డాం

2016 ఉరీ దాడి, 2019 పుల్వామా ఘటనలు దేశవ్యాప్తంగా కల్లోలాన్ని కలిగించాయి. కానీ ఆ కన్నీళ్లు మన బలహీనత కాదు, మన మానవత్వానికి నిదర్శనం. వెంటనే స్పందించిన భారత్, సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్ ద్వారా దేశ శక్తిని మాత్రమే కాదు, నైతిక పటిష్టతను కూడా ప్రపంచానికి చాటింది.

తాజాగా 2025 ఏప్రిల్ 22న మరో ఘోర దుర్ఘటన పహెల్గాం వద్ద బైసరాన్ లోయ ఉగ్రదాడి.

'మినీ స్విట్జర్లాండ్'గా పేరొందిన ఆ ప్రాంతంలో పర్యాటకులపై మిట్ట మధ్యాహ్నం తుపాకుల మోతలతో దాడి జరిగింది. 26 మంది అమాయకులు అక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి పర్యాటక అభివృద్ధిని, ప్రకృతి శాంతిని, ఐక్యతా, సామరస్యాలను లక్ష్యంగా చేసుకున్నదని స్పష్టంగా తెలుస్తోంది. అయినప్పటికీ, మన దేశ సంకల్పాన్ని ఇవి దెబ్బతీయలేవు. భయాన్ని రెచ్చ గొట్టాలన్న వారి కుట్రలు ప్రతిసారీ విఫలమవుతూనే ఉన్నాయి. ప్రతి దాడి తర్వాత మన కళ్లలో మెరుపు ఎక్కువైంది. ఈ ధృఢ సంకల్పమే 'ఆపరేషన్ సింధూర్' రూపంలో ప్రతిఫలించింది. పహెల్గాం దాడికి సంబంధించి నేరుగా బాధ్యులను పట్టుకోలేక పోయినా, భద్రతా వైఫల్యం ఎంతగా ఉన్నా పాక్ ఉగ్ర స్థావరాలపై మన బలగాలు జరిపిన ప్రతీకార చర్య ప్రపంచ దృష్టిని ఆకర్షిం చింది.

ఇద్దరు మహిళల నేతృత్వంలో జరిగిన ఈ వ్యూహాత్మక సైనిక చర్య భారత సైనిక సామర్థ్యాన్ని మాత్రమే కాదు, భారత మహిళా శక్తిని కూడా చాటింది.

## ఉగ్రవాదానికి మతం ఉండదు

భయాన్ని మట్టుబెట్టాలంటే, మనిషిలోని ద్వేషాన్ని తొలగించాలి. శాంతిని పెంపొందించే విలువలను బోధించాలి. మతం, భాష, జాతి పేరుతో భయాన్ని వ్యాపింపజేసే వారిని వ్యతిరేకించాలి. అసహనాన్ని రెచ్చగొట్టే మాటలకు బదులుగా, సమాజాన్ని కలుపుకుపోయే సంస్కారాన్ని పెంపొందించాలి. శాంతి అనేది ఆయుధాలతో కాదు, ఆలోచనల మార్పుతో సాధ్యమవుతుంది. మానవతా విలువలతోనే ఉగ్రవాదాన్ని ఓడించాలి. సమాజంలో అసహనం పోగొట్టే సంస్కారమే శాంతికి బాట. ఉగ్రవాదం, మతోన్మాదం నశిస్తేనే శాంతి నెలకొంటుంది. కనుక వీటి నిర్మూలనకు మనవంతు ప్రయత్నం చెయ్యాలి. ప్రయత్నమే చైతన్యానికి గుర్తింపు. మాటలతోనైనా, మౌనంతోనైనా, చేసే ప్రతి చర్య ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలబడే సంకేతం కావాలి. భయం ముందు తలవంచని మన శక్తే దేశానికి నిజమైన రక్షణ కవచం. ఎవరైతే దేశం కోసం ప్రాణాలు అర్పిస్తారో వారి త్యాగాలు వ్యర్థం కావు. వాళ్ల తుది శ్వాసలో మన భద్రత ఉంది. మన శ్వాసల్లో వాళ్ల ఆశయం ఉంది. ఉగ్రవాదాన్ని ఖండించడం అవసరం. ప్రతిసారీ మనం చుట్టూ వ్యక్తమవుతున్న అసహనాన్ని, విద్వేషాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉంటుంది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం అంటే, అది విలువల కోసం జరిగే పోరాటం. శాంతిని, మానవతను, సహజీవనాన్ని ప్రతిష్ఠించే ఈ పోరాటంలో మన ప్రతి ఆలోచన, ప్రతి చర్య కూడా ఆయు ధమే. మన పాఠశాలల బోధనల్లో, కుటుంబాల సంస్కారాల్లో, రాజకీయ సభల్లో ఈ విషయం చెప్పాలి. మతాన్ని, భాషను, వర్గాన్ని ఆయుధంగా వాడే కుట్రలకు మనం బలికాకూడదు. నిజానికి ఉగ్రవాదానికంటూ మతం ఉండదు. మాలేగావ్, మక్కా మసీదు, అజ్మీర్ దర్గా, సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌ల్లో జరిగిన అమానవీయ దాడులే దీనికి నిదర్శనం. అజ్మల్ కసాబ్ అయినా, అసిమానంద స్వామి అయినా, ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ అయినా, అజర్ మసూద్ అయినా – వారందరూ ఒకేతాను ముక్కలు, మానవత్వానికి వ్యతిరేకమైన హింసా ప్రవృత్తికి ఉదాహరణలు. ఈ దేశ సమగ్రతను కాపాడడానికి ఇటువంటి అన్ని రకాల, అన్ని రూపాల ఉగ్రవాదాలకు వ్యతిరేకంగా నిలబడే ధైర్యం మనకు అవసరం. అది మాత్రమే నిజమైన జాతీయత.


అందుకే... 'ఇది యుద్ధానికి పిలుపు కాదు, విలువల్ని కాపాడు కునే పోరాటానికి పిలుపు.' ✤


సహజీవన భావనల పావురాయి గీటురాయి వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థా లను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

# సుప్రీం కోర్టు వాఖ్యల నేపథ్యంలో



# మతానికి అతీతమైన భాష ఉర్దూ ఐక్యత, సాహిత్య వైభవం వారసత్వం

**సేకరణ : ముహమ్మద్ అజ్గర్ అలీ**

**భారత సుప్రీంకోర్టు** ఇటీవల ఉర్దూను గంగా – జముని తహ్‌జీబ్ యొక్క అత్యుత్తమ నమూనాగా అభివర్ణించడం జరిగింది, అటువంటి గుర్తింపు భారతదేశ బహుళ సంస్కృతిని గొప్ప చరిత్రతో ఉర్దూ అంతర్గత సంబంధాన్ని గుర్తు చేస్తుంది. ఉర్దూ భారతదేశ మిశ్రమ వారసత్వాన్ని – పర్షియన్, అరబిక్, టర్కిష్, సంస్కృతం మరియు స్థానిక మాండలికాల అందమైన సంగమం ఉర్దూ భారత గడ్డపై ఉద్భవించింది.

భాష మతం కాదు–భాష సంస్కృతి. ముస్లిం, హిందువులు, సిక్కులు క్రైస్తవుల అందరి భాష ఉర్దూ.

## స్వాతంత్ర్య పోరాటంలో ఉర్దూ

భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఉర్దూ కీలక పాత్ర పోషించింది. ఇది నిరసనల కవిత్వం. రాజకీయ చైతన్యాల భాష. **'ఇంక్విలాబ్ జిందాబాద్'**, 'సర్ఫరోషికి **తమన్నా'** వంటి విప్లవాత్మక నినాదాలు ఉర్దూలో ప్రాచుర్యం పొందాయి. లక్షలాది మందితో ప్రతిధ్వనించాయి. మౌలానా అబుల్ కలాం ఆజాద్, మౌలానా జాఫర్ అలీ ఖాన్ వంటి ప్రముఖులు సంపాదకత్వం వహించిన **'జమీందార్'**, **'అల్–హిలాల్'** వంటి ఉర్దూ వార్తా పత్రికలు ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని మేల్కొల్పడంలో కీలక పాత్ర పోషించాయి.

సామాన్యులను చేరుకోవడానికి నాయకులు ఉర్దూను ఒక మార్గంగా ఉపయోగించారు. మహాత్మాగాంధీ స్వయంగా ఉర్దూ ప్రాముఖ్యతను గుర్తించి తన ప్రచురణలు, ప్రసంగాలలో దాని ఉపయోగానికి మద్దతు ఇచ్చారు. ఈ భాష ప్రాంతీయ, మత పరమైన సరిహద్దులను దాటి ఒక ఏకీకృతశక్తిగా పని చేసింది.

## గొప్ప సాహిత్య వారసత్వం

ఉర్దూ సాహిత్య వారసత్వం విశాలమైనది, లోతైనది. ముఖ్యంగా కవిత్వం తాత్విక గొప్పతనానికి ప్రసిద్ధి చెందింది. మీర్ తకీ మీర్, దాగ్ దెహ్లీల (Daagh Dehlvi) గజల్ల నుండి ఫైజ్ అహ్మద్ ఫైజ్ విప్లవాత్మక కవితలు, అల్లామా ఇక్బాల్ యొక్క ఆధ్యాత్మిక తత్వశాస్త్రం, ఉర్దూ కవిత్వం మానవ భావోద్వేగం, సామాజిక వాస్తవికత ప్రతి అంశాన్ని తాకుతుంది.

ఉర్దూలో గద్యం కూడా అద్భుతమైన వైవిధ్యాన్ని కలిగి ఉంది. మున్షీ ప్రేమ్‌చంద్ వంటి రచయితలు సామాన్యుల పోరాటాలను చిత్రీకరించడానికి ఉర్దూ భాషను ఉపయోగించారు. సాదత్ హసన్ మాంటో, ఇస్మత్ చుగ్తాయ్, కిషన్ చందర్ మతతత్వం, అణచివేతలకు వ్యతిరేకంగా మాట్లాడే శక్తివంతమైన చిన్న కథలను రాశారు.

ఉర్దూ సినిమా, సంగీతం, నాటక రంగాల భాష. బాలీవుడ్ దశాబ్దాలుగా ఉర్దూ సాహిత్యంతో అభివృద్ధి చెందింది. కైఫీ అజ్మీ, సాహిర్ లుధియాన్వి, జావీద్ అక్తర్ మరియు గుల్జార్ వంటి ప్రముఖ రచయితలు / కవులు ఉర్దూలో భారతీయ సినిమా యొక్క అత్యంత ప్రసిద్ధ పాటలు, సంభాషణలను రాశారు, ఇది భాష యొక్క భావోద్వేగ, సౌందర్య ఆకర్షణను రుజువు చేస్తుంది.

## ఉర్దూకు హిందూ రచయితల సహకారం

ఉర్దూ అభివృద్ధి హిందూ రచయితలు, కవులు మరియు పండితుల కృషితో చాలా ముడిపడి ఉంది. 19వ శతాబ్దపు నవలా రచయిత పండిట్ రతన్ నాథ్ సర్షర్ ఉర్దూ కల్పన మార్గదర్శకులలో ఒకరు. పండిట్ రతన్ నాథ్ సర్షర్ రచన, ఫసానా-ఎ-ఆజాద్, ఉర్దూ సాహిత్యంలో ఒక మైలురాయిగా పరిగణించబడుతుంది. మరొక హిందూ కవి బ్రిజ్ నారాయణ్ చక్‌బాస్ట్, దేశభక్తిగల ఉర్దూ కవిత్వం రాశారు, అది భారతీయులకు స్ఫూర్తినిచ్చింది.

ప్రేమ్‌చంద్ ( ధన్‌పత్ రాయ్ శ్రీవాస్తవ), ఉర్దూలో తన సాహిత్య జీవితాన్ని ప్రారంభించాడు. గొప్ప ఉర్దూ చిన్న కథా రచయితలలో ఒకరుగా పరిగణించబడ్డాడు. సోజ్-ఎ-వతన్ లేదా ప్రేమ్‌చంద్ ఉర్దూ రచనలు బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా తొలి సాహిత్య ప్రతిస్పందనలు.

ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది, అనేక మంది సమకాలీన హిందూ రచయితలు, పండితులు ఉర్దూ సాహిత్యం, అనువాదం, విద్యకు దోహదపడుతున్నారు. వారి ప్రయత్నాలు ఉర్దూ ఒక ధార్మిక సమాజానికి చెందినదనే అపోహను తొలగించడానికి, ఉమ్మడి సాంస్కృతిక నిధిగా దాని పాత్రను బలోపేతం చేయడానికి సహాయపడతాయి.

## ఉర్దూ ఒక సజీవ వారసత్వం

ఉర్దూ భారతదేశ సంస్కృతిలో లోతుగా వేళ్ళూనుకుంది. ఇది బాలీవుడ్ సాహిత్యం, టీవీ నాటకాలు, సూఫీ సంగీతం, రోజువారీ భాషలలో మనుగడ సాగిస్తుంది. ఇది భారతీయ కవిత్వ ఉత్సవాలు (ముషాయిరాలు), సాహిత్య ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలలో అభివృద్ధి చెందుతూనే ఉంది.

ఇప్పుడు కావలసింది ఉర్దూ విద్యకు, దాని సాహిత్య పరిరక్షణకు మరింత సంస్థాగత మద్దతు. ప్రజలు ఉర్దూను మత పరమైన చిహ్నంగా కాకుండా వారి సాంస్కృతిక గుర్తింపులో భాగంగా తిరిగి చూడడం ప్రారంభించారు. ✤

## ఆయన హజ్ సంకల్పానికి విమానం తలవంచింది




లిబియాలోని సెభా ఎయిర్‌పోర్టులో మే 26న అద్భుత సంఘటన చోటు చేసుకుంది. హజ్ యాత్రకు బయలుదేరవలసిన అమీర్ అల్ మన్సూర్ పాస్పోర్ట్ సమస్య వచ్చి విమానం ఎక్కలేకపోయాడు. విమానం టేకాఫ్ అయ్యింది. అయినా అమీర్ ఎయిర్‌పోర్టు వదలకుండా అక్కడే కూర్చున్నాడు. సిబ్బంది అతన్ని ఇంటికి పంపేందుకు ప్రయత్నించినా, అతను వినలేదు. తరువాత, ఆ విమానానికి సాంకేతిక సమస్య రావడంతో తిరిగి అదే ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావాల్సి వచ్చింది. ఈ లోగా అతని పాస్‌పోర్ట్ ఇష్యూ సమస్య కూడా పరిష్కారం అయ్యింది. కానీ, పైలట్ భద్రతా కారణాల వల్ల అతన్ని ఎక్కించలేమని చెప్పాడు. విమానం మరోసారి టేకాఫ్ అయింది. అయినా అమీర్ మాత్రం విశ్వాసం కోల్పోలేదు "విమానం నన్ను తీసుకోకుండా వెళ్లదు, నేను హజ్ కోసం దృఢ సంకల్పం చేసుకున్నాను" అన్నాడు. ఆఖరికి మళ్ళీ అదే విమానానికి సాంకేతిక సమస్య వచ్చి మరోసారి కూడా తిరిగి ల్యాండ్ కావాల్సి వచ్చింది. ఈసారి పైలట్ స్వయంగా- "ఈ విమానం అమీర్ లేకుండా ఎగరదు" అంటూ అతన్ని తీసుకుని వెళ్ళారు. ఈ ఘటనను అల్ జజీరా ఛానెల్ ప్రసారం చేసింది. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.




# హజ్ యాత్ర పరమార్థం

**హజ్ యాత్ర** మహోన్నతమైన దైవారాధన. దైవ సామీప్యానికి మంచి అవకాశం. హజ్‌యాత్ర చేసేవారికి కారుణ్యమూర్తి మహాప్రవక్త ముహమ్మద్(స) పాపాల నుంచి విముక్తి లభిస్తుందనే, స్వర్గ ప్రవేశం ప్రాప్తమవుతుందనే శుభవార్తను ఇచ్చారు. ఇది ఇస్లామ్ ధర్మ మౌలిక విధుల్లోని ఒకటి. ఇందులో అసంఖ్యాకమైన ధార్మిక, ప్రాపంచిక, సామాజిక, సాంస్కృతిక ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయి. ఈ ప్రయోజనాలన్నింటినీ చక్కగా పొందడానికి మనిషి గట్టి సంకల్పం, బాగా కృషి చెయ్యవలసి ఉంటుంది. హజ్‌కు సంబంధించిన ఆరాధనల ద్వారా ఒక ముస్లింకు నేర్పే పాఠాలేమిటంటే, మీ ప్రభువు ఒక్కడే, ఆయన సకల శక్తిసంపన్నుడు. కనుక మీరు మీ సమస్యలన్నింటి పరిష్కారానికి ఆయన్నే మొరపెట్టుకోండి. ఆయన మీకు తప్పకుండా సహాయపడతాడు అని.

హజ్ యాత్ర ధనానికి సంబంధించిన ఆరాధన. అంటే ఎవరి వద్దనైతే హజ్ యాత్ర చేసే స్థోమత ఉందో వారిపై మాత్రమే హజ్ యాత్ర విధించబడింది. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "ప్రప్రథమంగా మానవుల కొరకు నిర్మించబడిన ఆరాధనా గృహం నిస్సందేహంగా బక్కాలో (మక్కాలో)ఉన్నదే. దానికి సకల శుభాలు ప్రసాదించబడ్డాయి. విశ్వ ప్రజలందరికీ అది మార్గదర్శక కేంద్రంగా రూపొందించబడింది. దానిలో స్పష్టమైన సూచనలు ఉన్నాయి. ఇబ్రాహీం ప్రార్థనా స్థలం ఉన్నది. దానిలో ప్రవేశించిన వాడు రక్షణ పొందుతాడు. ప్రజలపై ఉన్న హక్కు ఏమిటంటే ఈ గృహానికి వెళ్ళే శక్తి గలవారు దాని హజ్‌ను విధిగా చెయ్యాలి. ఈ ఆజ్ఞను పాలించటానికి తిరస్కరించేవాడు అల్లాహ్‌కు ప్రపంచ ప్రజల అవసరం ఎంత మాత్రం లేదు అని స్పష్టంగా తెలుసుకోవాలి".
(3: 96, 97)

హజ్రత్ అబూ హురైరా(రజి) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త(స) ఒకసారి ప్రసంగంలో ఇలా సెలవిచ్చారు: ఓ ప్రజలారా! హజ్ యాత్ర మీపై విధిగా చెయ్యబడింది. కనుక మీరు దానిని నిర్వర్తించే ప్రయత్నం చెయ్యండి (ముస్లిం).

హజ్రత్ ఇబ్నె ఉమర్(రజి) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త(స) గారితో 'ఓ దైవప్రవక్తా(స)! ఏ వస్తువు మాకు హజ్ యాత్ర చెయ్యటానికి తప్పనిసరి చేస్తుంది?' అని ప్రజలు విన్నవించు కున్నారు. దానికి ఆయన(స) ఇలా సెలవిచ్చారు: వస్తు సామగ్రి, వాహనం. (తిర్మిజీ)

ముస్లిమ్ అయిన ఒక వ్యక్తి వివేకి, యుక్త వయస్సుకు చేరినవాడు, ఆరోగ్యవంతుడు, ఎలాంటి వైకల్యం లేనివాడు అయినట్లయితే అతని అవసరాలు తీరిన తరువాత హజ్ యాత్ర చెయ్యటానికి సరిపడా డబ్బులు జమ అయి ఉన్నట్లయితే, ఇంకా అతను హజ్ యాత్ర నుంచి తిరిగి ఇంటికి చేరేవరకు తన బాధ్యతలో ఉన్న తన ఇంటివారి ఖర్చులకు సరిపడా డబ్బులు ఉన్నట్లయితే ఇంకా ప్రయాణ మార్గం కూడా శాంతియుతంగా ఉన్నట్లయితే, అప్పుడు

అతనిపై హజ్ యాత్ర విధిగా చెయ్యబడింది. స్త్రీ చేసే ప్రయాణానికి ఆమెతోపాటు మహరమ్ పురుషుడు తప్పకుండా ఉండాలి. కాబట్టి హజ్ యాత్రకు కూడా మహరమ్ అయిన వ్యక్తి తోడుగా ఉన్నప్పుడు ఆమె ప్రయాణానికి సిద్ధం కావాలి. మహరమ్ అయిన వ్యక్తి తన సొంత డబ్బులతో హజ్ యాత్ర చేస్తున్నా లేదా స్త్రీ డబ్బులతో చేస్తున్నాసరే ఏమీ ఫరవాలేదు.

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: హజ్జె మబ్రూర్‌కు బదులు స్వర్గం తప్ప మరేమీ కాదు (మిష్కాత్). ఒక వ్యక్తి హజ్ యాత్ర చేస్తున్నప్పుడు అందులో ఎలాంటి పాపపు కార్యాలు, లజ్జా విహీనమైన కార్యాలు చెయ్యకుండా జాగ్రత్తగా ఉన్నట్లయితే అతను పూర్వం చేసిన పాపాలన్నీ క్షమింపబడిన స్థితిలో తిరిగి ఇంటికి చేరుతాడు. ఎలాగంటే అతను తల్లి గర్భంలోనుంచి ఇప్పుడే పుట్టినట్లుగా పరిశుద్ధుడై తిరిగివెళ్తాడు. (బుఖారీ)

అమ్ర్ బిన్ ఆస్(ర) ఇలా తెలియజేశారు: అల్లాహ్ నా హృదయంలో ఇస్లామ్ పట్ల ప్రేమను జనింపజేసినప్పుడు నేను దైవప్రవక్త(స) గారి సమక్షంలో హాజరయ్యాను. ఇంకా దైవప్రవక్త(స) గారితో, 'ఓ దైవప్రవక్తా(స)! మీ చెయ్యిచాపండి. నేను ఈ రోజు మీ చేతిపై బైఅత్ చేస్తున్నాను' అని విన్నవించుకున్నాను. వెంటనే దైవప్రవక్త(స) తన పవిత్ర హస్తాన్ని నా ముందుకు చాపారు. నేను వెంటనే నా చెయ్యిని వెనక్కు లాక్కున్నాను. అప్పుడు దైవప్రవక్త(స) "ఓ అమ్ర్! నీకేమైంది" అని సెలవిచ్చారు: ఓ దైవప్రవక్తా(స)! ఒక షరతు పెట్టదలుస్తున్నాను అని విన్నవించుకున్నాను. దానికి ఆయన(స) ఏమిటి ఆ షరతు? అని సెలవిచ్చారు. నా షరతు ఏమిటంటే, అల్లాహ్ నా పాపాలన్నీ మన్నించి వేయాలి అని తెలియజేసుకున్నాను. దానికి ఆయన(స) ఇలా సెలవిచ్చారు; "ఓ అమ్ర్! నీకు తెలియదా! ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించినట్లయితే అది పూర్వపు పాపాలన్నీ మన్నించి వేస్తుంది. ఇంకా హిజ్రత్ చెయ్యటం ద్వారా కూడా పాపాలన్నీ మన్నించి వేస్తుంది. ఇంకా హజ్ యాత్ర ద్వారా కూడా పూర్వపు పాపాలన్నీ మన్నించి వేస్తుంది". (ముస్లిమ్)

చాలామంది తనపై హజ్‌యాత్ర విధిగా అయిన తరువాత కూడా అంటే దానికి కావలసిన శక్తిసామర్థ్యాలు కలిగి ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వహిస్తారు. వాయిదాలు వేస్తూ ఉంటారు. అటువంటి వారిని ఆయన(స) కఠినంగా హెచ్చరించారు. ఆయన(స) ఒక సూక్తిలో ఇలా సెలవిచ్చారు: ఏ వ్యక్తి వద్దనైనా హజ్ యాత్రకు కావలసిన సామగ్రి, వాహనం ఉన్నప్పటికీ అతను హజ్‌యాత్ర చెయ్యక పోయినట్లయితే అతను యూదునిగానో, నస్రానీ గానో మరణించవచ్చు (తిర్మిజీ). కనుక హజ్ యాత్ర చెయ్యటానికి ఆలస్యం చెయ్యరాదు. స్థోమత, సౌకర్యం కలగగానే వెంటనే బయలుదేరాలి. ఎందుకంటే ఎవరికీ తమ జీవితకాలంపై ఎలాంటి నమ్మకమూ లేదు. ఒకవేళ జీవిత కాలం ముగిసినట్లయితే అప్పుడు విధి అయిన హజ్ చెయ్యకుండా ఉన్నట్లయితే అల్లాహ్ ఆగ్రహానికి గురికావలసి ఉంటుంది.

అల్లాహ్ ముస్లిములపై హజ్‌యాత్రను విధిగా చేసి వారిలో ప్రేమానురాగాలు జనించే, సమానత్వం, సోదరభావం కలిగే ఏర్పాట్లు చేశాడు. కాబా గృహాన్ని కేంద్రంగా చేసి ప్రపంచ ప్రజలందరూ ఒకే కాలంలో, ఒకే సమయంలో, ఒకే చోట కలుసుకునే ఏర్పాట్లు చేశాడు. ప్రాంతాలు, భాషలు వేరున్నా, రంగులు రూపురేఖలు వేరున్నా తామంతా ఒకే దైవానికి దాసులమని, సోదర సోదరీమణులమని కార్యరూపంగా ఎలుగెత్తి చాటుతారు. అందరూ ఒకేవిధమైన తెల్లని వస్త్రాలు ధరించి ఒకే భాష అంటే అరబీలో 'లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్' అంటూ నినదిస్తూ అల్లాహ్ మహోన్నతను ప్రకటిస్తారు.

హజ్ యాత్ర కోసం వెళ్ళేటప్పుడు అవసరమైన ప్రయాణ సామగ్రిని వెంట ఉంచుకోవాలని ఆదేశించబడింది. కాని ఉత్తమమైన సామగ్రి భయభక్తులే అని విశదీకరించి చెప్పటం జరిగింది. ప్రతి దైవకార్యం, పుణ్యకార్యం కోసం మౌలికంగా కావలసింది చిత్తశుద్ధి, భయభక్తులే. ఈ రెండు విషయాలు లేకుండా చేసే ఏ సత్కార్యమూ స్వీకరించబడదు. దీనిద్వారానే మనిషికి ఉత్తమ శిక్షణ లభిస్తుంది. దాని ప్రతిఫలమూ లభిస్తుంది.

హజ్ యాత్రలో ఉత్తమమైన రోజు అరఫా దినం. ఆ రోజున అల్లాహ్ ఈ లోకాన్ని ప్రత్యేకంగా వీక్షిస్తూ తన దాసులు చూపే వినమ్రతపైన, దీనస్థితిపైన తన దూతల ముందు గర్విస్తూ వారితో 'ఓ దూతలారా! చూడండి, నా దాసులు ఎంత వ్యాకులతతో తీవ్రమైన ఎండలో ఎలా నా ముందు నిలబడ్డారో! వీరు ఎంతో దూరం నుంచి, కష్టపడి కేవలం నా కోసం ఇక్కడికి వచ్చారు. వీరు నా నరకాన్ని చూడనప్పటికీ దాని నుంచి రక్షణ పొందటానికి నా కారుణ్యం పొందాలనే కాంక్షతో ఇక్కడికి వచ్చారు' అని ప్రకటిస్తాడు. ఆ తరువాత అల్లాహ్ ఆ దాసులను నరకం నుండి విముక్తిని ప్రసాదిస్తాడు. అరఫా రోజున అల్లాహ్ తన దాసులను భారీ సంఖ్యలో ఎంతగా క్షమాభిక్ష పెడతాడంటే అంతటి భారీ సంఖ్యలో దాసులు ఏనాడూ క్షమాభిక్షను పొందలేరు.

ఇంకా హాజీలు మినా మైదానంలో జంతువుల ఖుర్బానీ చేస్తారు. అప్పుడు నిస్సందేహంగా నా నమాజ్, నా ఖుర్బానీ, నా జీవన్మరణాలు అల్లాహ్ కొరకే. ఆయన సర్వలోకాలకు ప్రభువు, ఆయనకు సాటి ఎవ్వరూ లేరు అని పలుకుతారు. హాజీలు ఈ పలుకులను తమ నోటితో పలికిన తరువాత తన జీవన రంగాలన్నింటిలోను సదా ఈ విషయాలను జ్ఞాపకం ఉంచుకోవాలి.

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: యాభై సార్లు కాబా ప్రదక్షిణం చేసిన వారు తమ తల్లికి ఈ రోజే జన్మనిచ్చినట్లుగా తమ పాపాల ప్రక్షాళన చేసుకుంటారు (తిర్మిజీ).

హజ్ యాత్రలో చేసే ప్రతి ఆరాధన ద్వారా దాసుడు అల్లాహ్‌తో "ఏవిధంగానైతే నేను ఈ రోజున నీ ఆరాధనలో మునిగిపోయానో అదేవిధంగా మిగతా జీవితం కూడా నీ ఆరాధనలోనే మునిగి ఉంటాను, నీ ఇష్టాయిష్టాలను జ్ఞాపకం ఉంచుకుంటాను. కనుక నన్ను క్షమించు" అని అర్థిస్తాడు. కనుక ప్రతి హాజీ తిరిగి తన ఇంటికి చేరుకున్న తరువాత జీవితాంతం ఈ వాగ్దానాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలి.




# పర్యావరణాన్ని కాపాడుకుందాం!

డా. ఎన్. ఖలీల్, హైదరాబాద్

**పర్యావరణ దినోత్సవం** అతిపెద్ద అంతర్జాతీయ దినోత్సవం. ప్రతి సంవత్సరం జూన్ 5న జరుపుకునే ఈ ఐక్యరాజ్య సమితి దినోత్సవం, ఇది మన భూమిని రక్షించడానికి, ప్రభుత్వాలు, వ్యాపారాలు, సంఘాలు, వ్యక్తులను స్థిరమైన మార్పు దిశగా నడిపించడానికి, శక్తివంతం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని ఒక భాగస్వామ్య లక్ష్యంలో ఒకచోట చేర్చింది.

2025 ప్రపంచ పర్యావరణ దినోత్సవం థీమ్ "ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం". ఈ ప్రచారం ప్లాస్టిక్ వ్యర్థాల విస్తృత ప్రభావాన్ని, మహాసముద్రాలు, జలమార్గాలను కలుషితం చేయడం నుండి మైక్రోప్లాస్టిక్‌ల రూపంలో మన ఆహార వ్యవస్థల్లోకి చొరబడటం వరకు నొక్కి చెబుతుంది.

తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు లేదా అభివృద్ధి చెందుతున్న దేశాలు, తమ పర్యావరణ వనరులను పరిరక్షించడానికి తగిన విధానాలను అనుసరించలేకపోతున్నాయి. ఇది ఆ దేశాల పర్యావరణాన్ని తీవ్ర స్థాయిలో నాశనం చేస్తోంది. ప్రపంచం మొత్తం పర్యావరణ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్లోబల్ వార్మింగ్, వాయు కాలుష్యం, నీటి ప్రదూషణ, జీవవైవిధ్య నష్టం వంటి అనేక సమస్యలు మన జీవన విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలకు ప్రధాన కారణం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పర్యావరణ దోపిడీ. ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక ప్రయోజనాల కోసం ఇతర దేశాల సహజ వనరులను దోపిడీ చేయడం, తద్వారా స్థానిక ప్రజల జీవన విధానాలపై ప్రతికూల ప్రభావం చూపడం, పర్యావరణ దోపిడీకి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఈ సమస్యను అరికట్టేందుకు పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్ట దినాన్ని పాటిస్తారు. ఈ సందర్భంలో అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అంటే ఏమిటి, దాని ప్రభావాలు, నివారణ చర్యలు, మన బాధ్యతలు వంటి అంశాలను పరిశీలించడం అవసరం. అడవుల నరికివేత, భారీ పరిశ్రమలు నెలకొల్పటం, రసాయనాల వాడకం వంటివి జంతువుల నివాసాలను ధ్వంసం చేస్తాయి. వీటి వల్ల అనేక జీవజాతులు అంతరించిపోతాయి. జీవవైవిధ్యం కనుమరుగవడం వల్ల పర్యావరణ సమతుల్యతలో గణనీయమైన మార్పులు వస్తాయి. పరిశ్రమల నుంచి ఉద్గారాలు, వ్యవసాయ రసాయనాలు, ఇతర వ్యర్థ పదార్థాలు నదులు, సముద్రాలు, వాయు మండలాన్ని కలుషితం చేస్తాయి. ఇది పర్యావరణానికి మాత్రమే కాకుండా, మన ఆరోగ్యానికీ ప్రమాదకరమే. దీని వలన వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, భూ సామర్థ్యం తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వనరులను అతిగా వినియోగించడం, చెట్లను నరికివేయడం, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను పెంచడం వలన వాతావరణంలో వేడి పెరుగుతోంది. దీని కారణంగా గ్లోబల్ వార్మింగ్ అనే సమస్య పెరిగి వాతావరణంలో అతివృష్టి, కరవు వంటి ప్రతికూల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వాతావరణ మార్పు వల్ల వరదలు, కరవులు, అగ్నిప్రమాదాలు వంటి సహజ వైపరీత్యాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఈ ప్రక్రియలతో పర్యావరణం నాశనం తక్షణమే కనిపించకపోయినా, దీర్ఘకాలంలో వీటి ప్రతికూల ప్రభావం పెద్ద స్థాయిలో ఉంటుంది.

కాలుష్యం వల్ల మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయి. వాయుకాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు, నీటి కాలుష్యంవల్ల నీటి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు ప్రబలుతున్నాయి. శరీరంలో విషపదార్థాలు చేరటం వల్ల కేన్సర్, జన్యు వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీని అరికట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. పర్యావరణ పరిరక్షణ కోసం పలు అంతర్జాతీయ ఒప్పందాలు కుదిరాయి. టోక్యో ప్రోటోకాల్, పారిస్ ఒప్పందం వంటి ఒప్పందాల ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు దేశాలు ఒక ప్రణాళికను అనుసరిస్తున్నాయి. ఈ ఒప్పందాలు పర్యావరణ పరిరక్షణకు దేశాల మధ్య సహకారాన్ని పెంపొందిస్తున్నాయి. ప్రతి దేశం పర్యావరణ పరిరక్షణ కోసం సొంత చట్టాలను రూపొందిస్తోంది. వనరులను అధికంగా వినియోగించే సంస్థలపై నియంత్రణ విధించేలా చట్టాలు అమలు చేస్తున్నాయి. కాలుష్య నియంత్రణ, వనరుల పరిరక్షణ, రక్షణాత్మక చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు చట్టాలను రూపొందిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణపై ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఇతర సంస్థలు జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. పర్యావరణ సమస్యలను ప్రజలకు వివరించడం, అవగాహన కల్పించడం వల్ల ప్రజలు తమ జీవన శైలిని సవరించుకోవడానికి ఆసక్తి చూపిస్తారు. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తి, పవనశక్తి వంటి పునరుత్పాదక ఇంధనాలను వినియోగించడాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ వనరులు పర్యావరణానికి హానికరమైన కర్బన ఉద్గారాలను తగ్గించడంలో సహాయ పడతాయి.

ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణలో తనవంతు బాధ్యతను నిర్వర్తించాలి. వాహనాలను తక్కువగా వినియోగించడం, పునర్వినియోగ పదార్థాలు ఉపయోగించడం, నీటి వనరులను ఆదా చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చు. పర్యావరణానికి మేలుచేసే మొక్కలను నాటి, వాటిని సంరక్షించడం ద్వారా వాయు కాలుష్యం తగ్గించవచ్చు. పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తులను ఎంచుకోవడం, ప్లాస్టిక్ వంటి పదార్థాల వాడకాన్ని తగ్గించడం, మన పరిసరాల్లోని వారికి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించడం చేపట్టాలి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ ఒక తీవ్రమైన సమస్యగా మన ముందుంది. దీనిని అరికట్టడానికి ప్రభుత్వాలు, సంస్థలు, ప్రజలు కలిసి కృషిచేయాలి. పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత. మనం పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన జీవనం అందించగలుగుతాం.

చివరగా చెప్పేదేమిటంటే..

పుడమి నుండి పురుడు పోసుకున్న విత్తనాన్ని అడుగు..

నేలపురిటి నొప్పుల గురించి చెబుతుంది..

కడుపు నింపే ఆ విత్తనానికి లేని భేషజం నీకెందుకు?

నీ పాపాల శాపాల కాలుష్య రక్కసికి చిక్కి విలవిలలాడుతున్న స్వచ్ఛమైన గాలిని అడుగు..

కలుషిత విష వలయం నుండి బైట పడ్డ వైనాన్ని చెబుతుంది

నీ ప్రాణాన్ని నిలిపే ఆ గాలికి లేని అహం నీకెందుకు?

నీ మితిమీరిన అవసరాలకు బలి అవుతున్న నీటి వనరులను అడుగు..

నీవు గొట్టాలతో తోడే గడ్డు పరిస్థితుల సందర్భాలను చెబుతుంది.

ఆ నీటికి లేని ఆధిపత్యం నీ దాహానికెందుకు?

ఇకనైనా పర్యావరణాన్ని నీవు ప్రేమించకపోతే

నీ ఆత్మే నిన్ను "ఛీ"కొట్టి

నీ శరీరం నుండి వెళ్ళిపోతుంది!!


## చందాదారులకు విజ్ఞప్తి

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**35 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 46. అల్ అహ్కాఫ్

4-5 ప్రవక్తా, వీరికి చెప్పు, "మీరెప్పుడయినా కళ్ళు తెరచి ఏమన్నా చూశారా, మీరు దైవాన్ని కాదని పిలిచే ఆ అస్తిత్వాలు అసలు ఏమిటో అని? కాస్త నాకూ చూపండి అవి భువిలో ఏమయినా సృష్టించాయేమో, లేదా ఆకాశాల సృష్టిలోనయినా, నిర్వహణలోనయినా వాటిపాత్ర ఏమయినా ఉందేమో. మునుపు వచ్చినటువంటి గ్రంథం ఏదయినా, లేదా జ్ఞానంలోని మిగిలిన భాగమేదయినా (ఈ నమ్మకాలకు ఆధారంగా) మీ వద్దనున్నట్లయితే అదే తీసుకురండి, మీరు సత్యవంతులయితే."[4] ఇంతకు అల్లాహ్‌ను కాదని ప్రళయం వరకూ తనకు సమాధానం ఇవ్వలేని[5] వాటిని పిలిచే మనిషికన్నా అధికంగా దారి తప్పినవాడు మరెవడు కాగలడు, ఇంకా పిలిచేవారు తమను పిలుస్తున్నారన్న విషయం పట్ల కూడా ఏమీ ఎరుగనివారు.

4. సంబోధితులు బహుదైవారాధకుల జాతికి చెందినవారు కావటాన వారికి, బాధ్యతాభావం లేమివల్ల వారు ఏ విధంగా ఆలోచనా రహితంగా అత్యంత నిర్హేతుకమయిన ఒక విశ్వాసాన్ని పట్టుకుని వ్రేలాడుతున్నారో చెప్పడం జరుగుతోంది. వారు అల్లాహ్‌ను విశ్వ సృష్టికర్తగా అంగీకరించడంతోపాటు ఇతర శక్తులను ఆరాధ్యులుగా చేసుకున్నారు, వాటికే మొరపెట్టుకుంటారు, వాటినే తమ అవసరాలను తీర్చేవిగా ఆపద్బాంధవులుగా భావిస్తారు, వాటి సమక్షంలోనే సాష్టాంగ ప్రణామాలు చేస్తారు, వాటికే తమ మొక్కుబడులు అర్పించుకుంటారు, తమ భాగ్య విధాతలు ఇవేనని తమ అదృష్ట దురదృష్టాల నిర్మాణాధికారాలు వీరికే ఉన్నాయని నమ్ముతారు. వీటిని గురించే వారిని అడగటం జరుగుతోంది, మీరు వీటిని దేని ఆధారంగా ఆరాధ్యులుగా చేసుకున్నారని. పరమ ప్రభువు అల్లాహ్‌తో ఎవరినయినా ఆరాధనలో భాగస్వామ్యం కల్పించడానికి రెండే ఆధారాలు కాగలవు. మనిషికి స్వయంగా ఏదయినా జ్ఞానమార్గం ద్వారా తెలియాలి, భూమ్యాకాశాల నిర్మాణంలో ఆ శక్తికి కూడా నిజంగానే ఏదయినా ప్రమేయం ఉందని, లేదా స్వయంగా అల్లాహ్ తానే చెప్పి ఉండాలి, ఫలానా అయ్యావారు సయితం నా దైవత్వ కార్యంలో నాకు తోడుగా ఉన్నారని. ఒక బహుదైవారాధకుడు తన ఆరాధ్యులు దేవుని సహవర్తులనడానికి నేరుగా ఏదయినా జ్ఞానం ఉన్నట్లు, లేదా దైవం పంపిన ఏ గ్రంథంలోనయినా దైవం స్వయంగా ఎవరినయినా తన భాగస్వామిగా నిర్ణయించినట్లు చూపెట్టాలి. లేకపోతే ఎట్టి పరిస్థితిలోనూ అతని విశ్వాసం పూర్తిగా నిరాధారమయినదనే చెప్పవలసి ఉంటుంది.

ఈ ఆయత్‌లో "మునుపు వచ్చినటువంటి గ్రంథం" అంటే ఖుర్‌ఆన్‌కు ముందు దైవం పంపిన ఏదయినా గ్రంథం అని ఉద్దేశం. అలాగే జ్ఞానంలో "మిగిలిన" భాగం అంటే, పూర్వకాలపు ప్రవక్తలు, సంస్కర్తలు బోధించిన బోధనల్లో ఏదయినా భాగం, తరువాతి తరాలకు ఏదయినా విశ్వసనీయమయిన మార్గం ద్వారా అందినది అని ఉద్దేశం. ఈ రెండు మార్గాల ద్వారా మనిషికి ప్రాప్తమయిన దానిలో ఎక్కడా బహుదైవారాధన ఛాయ కూడా లేదు. దైవగ్రంథాలన్నీ ఏకగ్రీవంగా ఖుర్‌ఆన్ అందజేసే దేవుని ఏకత్వపు సందేశాన్నే అందజేస్తున్నాయి. గతకాలపు మిగిలి ఉన్న జ్ఞాన నిధులన్నింటిలోనూ ఎక్కడా, ఏ వలీ అయినా, ఏ సత్పురుషుడయినా దైవం తప్ప ఇతరుల్ని ఎవరినయినా ఆరాధించమని, వారి దాస్యం చేయమని బోధించినట్లు ఏ రుజువూ ఏ సాక్ష్యమూ దొరకదు. పోతే, గ్రంథం అంటే దైవగ్రంథం, మిగిలి ఉన్న జ్ఞానం అంటే ప్రవక్తలు, సత్పురుషులు వదలిన జ్ఞానమని భావం. ఆ భావం అని గ్రహించకపోయినా ప్రపంచంలోని ఏ శాస్త్రీయ గ్రంథమయినా, ధార్మిక, ప్రాపంచిక జ్ఞానంలో ప్రవీణులయినవారి ఏ పరిశోధనలోనూ భూమీ లేదా ఆకాశంలోని ఫలానా వస్తువును దైవం కాక ఫలానా మహనీయులు, లేదా దేవత సృష్టించిందని లేదు; లేదా మానవుడు ప్రపంచంలో ప్రయోజనం పొందుతున్న ఏ వరప్రసాదంలోనయినా ఫలానా వర ప్రసాదం దైవం కాక ఫలానా ఆరాధ్యుని సృజన అని కూడా సూచించడం జరగలేదు.

5. సమాధానం ఇవ్వడం అంటే మాటల్లో కంఠం ద్వారా బదులివ్వడం, లేదా వ్రాతమూలకంగా వ్రాసి పంపడం అని అర్థం కాదు, సమాధానంగా చర్య తీసుకోవడమన్నది ఉద్దేశ్యం. భావమేమిటంటే, ఎవరయినా ఒక వ్యక్తి ఈ ఆరాధ్యులకు ఏదయినా దరఖాస్తు పెట్టుకుంటే, నివేదించుకుంటే లేదా వారిని దేన్ని గురించి అయినా వేడుకుంటే, వారి చేతుల్లో ఎటువంటి శక్తీ అధికారాల్లేవు గనక అతని అభ్యర్థనపై వారు ఏ చర్యా సకారాత్మకంగానయినా, నకారాత్మకంగానయినా తీసుకోలేరు. (మరిన్ని వివరాలకు చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం, సం.7, అజ్ జుమర్: పాదసూచి 24 – అను).

ప్రళయం వరకు సమాధానం ఇవ్వలేరన్న దాని భావం, ఈ ప్రపంచం మనగలిగినంత కాలమయితే వ్యవహారం, వీరి ప్రార్థనలకు వారి తరఫున ఎటువంటి సమాధానం దొరక్క పోవడం వరకే పరిమితమయి ఉంటుంది. కాని ప్రళయం వచ్చినప్పుడు దీన్ని మించి ముందుకు సాగి, ఆ ఆరాధ్యులు తమ ఈ ఆరాధకులకు శత్రువులుగా రూపొందుతారు – ముందువస్తున్న ఆయత్‌లో తెలిపినట్లు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## మహనీయ కాబ్ బిన్ మాలిక్ (రజి) వృత్తాంతం

(ఈయన తబూక్ యుద్ధంలో వెనుక ఉండిపోయిన వారిలో ఒకరు). వారి గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురిని కూడా అల్లాహ్ క్షమించాడు."

**277)** అబ్దుల్లాహ్ బిన్ కాబ్ బిన్ మాలిక్ కథనం: (కాబ్ బిన్ మాలిక్- రజి-కు వృద్ధాప్యంలో కంటిచూపు పోయినప్పుడు ఆయన కుమారుల్లో ఈయన గారే కాబ్‌ను పట్టుకుని దారిలో నడిపించేవారు). ఆయన ఇలా అన్నారు: నేను కాబ్(రజి) ద్వారా, ఆయన తబూక్ యుద్ధంలో పాల్గొనలేకపోవడానికి సంబంధించిన వృత్తాంతాన్ని విన్నాను. ఆయన (కాబ్ బిన్ మాలిక్) ఇలా వివరించారు-

"నేను ఒక్క తబూక్ యుద్ధం తప్ప మరే యుద్ధంలో కూడా దైవప్రవక్త(స)తో కలసి పాల్గొనకపోవటం అనేది జరగలేదు. కాకపోతే బద్ర్ సంగ్రామంలో కూడా నేను పాల్గొనలేదు. అయితే ఆ యుద్ధంలో పాల్గొనలేకపోయిన వారిపై దైవ ప్రవక్త(స) ఎలాంటి అసంతృప్తిని వ్యక్తపరచలేదు. ఎందుకంటే అదొక అనూహ్య పరిణామం. ఆ సమయంలో దైవప్రవక్త(స) కేవలం ఖురైషు వర్తక బిదారు అన్వేషణలో బయలుదేరారు. కాని దైవాజ్ఞపై, ఎలాంటి ముందస్తు సన్నాహాలు లేకుండానే ఆయన(స) తన శత్రువులతో తలపడాల్సి వచ్చింది. అయితే నేను 'అఖబా ప్రతిజ్ఞ' జరిగిన రాత్రి దైవప్రవక్త(స) సేవలో హాజరైన వారిలో ఒకణ్ణి. మేము (మక్కాలో) ఇస్లాం ధర్మోన్నతికై శపథం చేసిన రాత్రి అది. నా దృష్టిలో అది బద్ర్ సంగ్రామం కన్నా ప్రియమైనది. కాకపోతే బద్ర్ యుద్ధం గురించి జనులు చాలా ఎక్కువగా చర్చించుకుంటారు.

మూడవ విషయం: నేను తబూక్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(స)తో కలసి పాల్గొనలేకపోయిన రోజుల్లో ఆర్థికంగా చాలా బలోపేతంగా ఉన్నాను. అంతకుముందెన్నడూ నేను ఆర్థికంగా అంతగా స్థితిమంతుణ్ణి కాను. దైవసాక్షిగా! అంతకు మునుపెన్నడూ నా దగ్గర రెండు ఒంటెలు లేవు. కాని ఆ సందర్భంగా మాత్రం నా వద్ద రెండు ఒంటెలున్నాయి.

దైవప్రవక్త(స) ఏ యుద్ధానికయినా బయలుదేరవలసి ఉంటే, ఆ ప్రదేశం గురించి చూచాయగా మాత్రమే తెలియజేసేవారు. కాని ఈ యుద్ధ సందర్భం వచ్చినప్పుడు అలా చేయలేదు- అప్పుడు ఎండలు మండిపోతున్నాయి. ప్రయాణం కూడా సుదీర్ఘమైనది. పైగా అది ఎడారి ప్రయాణం. దానికితోడు శత్రువులు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. సర్వవిధాలా ఎన్నో కష్టాలు ఎదుర్కోవలసి ఉంది. అందుచేత ప్రవక్త మహనీయులు(స) ఈ యుద్ధం గురించి ప్రతి విషయం క్షుణ్ణంగా విడమరిచి చెప్పేశారు. మేము యుద్ధ సన్నాహాలు చేసుకోవాలన్నదే దీని ఉద్దేశం. ఏ మార్గం గుండా ప్రయాణం చేయవలసి ఉందో కూడా ఆయన(స) ముందుగానే సూచించారు. ఈ సందర్భంగా ముస్లింలు కూడా ఆయన(స) వెంట భారీ సంఖ్యలో ఉన్నారు. ఎంత ఎక్కువ మంది ఉన్నారంటే రిజిస్టరులో వారి పేర్లు నమోదు చేయటం కూడా కష్టమైపోయింది.

కాబ్(రజి) ఇలా అన్నారు: యుద్ధానికి వెళ్ళదలచని వ్యక్తి ఎవరయినా, తన గైర్హాజరు గురించి ఎవరికీ తెలియదని ఊహించడానికి కూడా ఆస్కారముంది. దైవవాణి అవతరిస్తే తప్ప ఎగనామం పెట్టినవారి గురించి తెలిసిరాదు. దైవ ప్రవక్త(స) ఈ ప్రయాణానికి బయలుదేరుతున్న రోజుల్లో ఖర్జూర పంట చేతికొచ్చి ఉంది. చెట్ల క్రింద కూర్చుని జనులు సేద తీరుతూ ఉండేవారు. ఒకవైపు దైవ ప్రవక్త(స), మరోవైపున ముస్లింలు కూడా ప్రయాణ సన్నాహాల్లో నిమగ్నులై ఉన్నారు. కాని నేను మాత్రం ఇప్పుడే తొందరేముందీ, రేపటి నుంచి తయారీ చేసుకుంటే సరిపోతుందిలే అని నా మనసుకు సర్ది చెప్పుకునేవాణ్ణి. ఈ విధంగా అనుదినం దాటవేస్తూ గడిపాను. తయారీ చేసుకోగలననే మితిమీరిన ధీమా నాది. సౌలభ్యాలు ఉండేవి. ఇలా ఊహించుకుంటూ ఉండే లోగానే పుణ్యకాలం దాటిపోయింది. ఈ లోగా జనులంతా తమ ప్రయాణ సన్నాహాలు పూర్తి చేసుకున్నారు. దైవప్రవక్త(స) వారందరినీ వెంటబెట్టుకుని ప్రయాణమయ్యారు.

అప్పటివరకూ నేను తయారీ ఏమీ చేసుకోలేదు. ఆ సమయంలో కూడా నేను నా మనసుకు సర్దిచెప్పుకున్న విషయం ఒక్కటే– రేపో ఎల్లుండో ప్రయాణ ఏర్పాట్లు చేసుకుంటే సరిపోదా? వేగంగా వెళ్ళి పయన బృందాన్ని చేరుకోలేనా ఏమి?

రెండవ రోజు ఏర్పాట్లకు సిద్ధమయ్యాను. కాని ఆ రోజు కూడా ఏమీ చేయలేకపోయాను. మూడవ రోజు ఈ పని కానిద్దాం అనుకున్నాను. కాని ఆ రోజు కూడా గడిచిపోయింది. ఆ విధంగా సమయం గడిచిపోయింది. మరోవైపు ప్రయాణ బృందం చాలా దూరం వెళ్ళిపోయింది. యుద్ధంలో పాల్గొనటమనేది సుదూర విషయం, కనీసం అక్కడకు వెళ్ళి వారిని కలుసుకున్నా సరిపోయేదే! అలా చేసినా బాగుండేది. కాని నా అదృష్టంలో అది కూడా లేదు.

దైవప్రవక్త(స) మదీనా నుండి వెళ్ళిన తరువాత నేను మదీనా వీధుల్లోకి వెళ్ళినప్పుడు నాకెంతో బాధ కలిగేది. ఎందుకంటే, నాకు తమ ముఖాల నుండి కాపట్యం వొలికేవారే కనిపించేవారు. లేదా అల్లాహ్ వికలాంగులుగా, వృద్ధులుగా ఖరారు చేసినవారు కానవచ్చేవారు. దైవప్రవక్త(స) నా గురించి ఎవరినీ, ఏమీ అడగలేదు. కాని ఆయన(స) తబూక్ చేరుకున్న మీదట, ఒక సమావేశంలో,“కాబ్ బిన్ మాలిక్ ఎక్కడ?” అని దర్యాప్తు చేశారు. దానికి సమాధానంగా బనూ సలిమాకు చెందిన ఒక వ్యక్తి, ‘దైవప్రవక్తా! అతని అహంకారం అతనిని రానివ్వలేదు (అతను తన అందచందాలు, భోగభాగ్యాలపై మిడిసిపడుతున్నాడు)’ అని చెప్పాడు. ఇది విన్న ముఆజ్ బిన్ జబల్ (రజి), ‘నీవు అతని గురించి చెప్పిన మాట చాలా చెడ్డది. దైవప్రవక్తా! దైవసాక్షిగా చెబుతున్నాను. మాకు అతని గురించి మంచి తప్ప మరొకటి తెలీదు’ అన్నారు. దైవప్రవక్త(స) మౌనం వహించారు.

కాబ్ బిన్ మాలిక్(రజి) ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు(స) తిరిగి వస్తున్నారని తెలిసినప్పుడు, నాకు విచారం పట్టుకుంది. రేపు దైవప్రవక్త(స) ఆగ్రహం నుండి తప్పించుకోవటానికి ఏదయినా కుంటి సాకు వెతకాలన్న ఆలోచన వచ్చింది. దీని గురించి నేను కుటుంబంలోని ప్రతి విజ్ఞుణ్ణీ సంప్రతించాను. కాని దైవప్రవక్త(స) మదీనా నగరాన్ని సమీపించారన్న వార్త అందగానే నా మదిలోని తప్పుడు ఆలోచనలన్నీ పటాపంచలైపోయాయి. దైవప్రవక్త(స) సమక్షంలో అబద్ధం చెప్పి నన్ను నేను ఏవిధంగానూ కాపాడుకోలేనని నిశ్చయించుకున్నాను. అందుకే ఏమయినాసరే నిజం చెప్పాలని సంకల్పించుకున్నాను.

దైవప్రవక్త(స) ఉదయం పూట ఏతెంచారు. ఆయన(స) ఎప్పుడు, ఏ ప్రయాణం నుండి వచ్చినా, మొదట మస్జిద్‌కు వెళ్ళి రెండు రకతుల నమాజ్ చేసి, అక్కడున్న జనులతో సమావేశమవటం ఆనవాయితీ. ఆయన(స) నమాజ్‌ను ముగించగానే జనులు ఆయన(స) సమక్షంలోకి రావటం మొదలెట్టారు. యుద్ధంలో పాల్గొననివారు ప్రమాణాలు చేస్తూ తమ సంజాయిషీ ఇచ్చుకుంటున్నారు. అలా కుంటిసాకులు చెబుతున్నవారి సంఖ్య ఎనభై వరకూ ఉంది. వారు పైకి చెబుతున్న కారణాలను దైవప్రవక్త(స) ఆమోదించారు. వారి నుండి ప్రమాణం తీసుకున్నారు. వారి మన్నింపునకై దైవాన్ని ప్రార్థించి, వారి అంతరంగ వ్యవహారాన్ని దైవానికే వదలిపెట్టారు.

ఆ తరువాత నేను ప్రవక్త(స) ఎదుట హాజరయ్యాను. నేను సలామ్ చేస్తే ఆయన(స) చిరునవ్వు చిందించారు. ఆ నవ్వులో కోపం తొంగిచూస్తోంది. “ఇలా రా!” అని ఆయన(స) పురమాయించారు. నేను ఆయన(స)కు మరింత దగ్గర జరిగి కూర్చున్నాను. “చెప్పు. నీవు యుద్ధంలో పాల్గొనకపోవడానికి కారణం ఏమిటి? నీవు కూడా వాహనాన్ని కొనలేకపోయావా?” అని దైవప్రవక్త(స) ప్రశ్నించారు.

సమాధానంగా నేను ఇలా విన్నవించుకున్నాను–

‘నా దగ్గర వాహనం ఉంది. దైవసాక్షి! తమరు గాకుండా మరెవరయినా ప్రాపంచిక వ్యక్తి నా ఎదుట ఉంటే, నేను ఏదో ఒక సాకు చెప్పి అతని ఆగ్రహం నుండి తప్పించుకోగలిగి ఉండేవాణ్ణి. నేను అందగాణ్ణి మాత్రమే కాదు, అందమైన మాటలు చెప్పే నేర్పు కూడా నాకు ఉంది. కాని దైవసాక్షిగా! నేను ఈ రోజు మీ సమక్షంలో ఏదయినా అబద్ధపు సంజాయిషీ ఇచ్చి, మిమ్మల్ని మభ్యపెట్టినా అతి త్వరలోనే అల్లాహ్ మీకు నా గురించి నిజం తెలియజేస్తాడు. అప్పుడు మీరు నా పట్ల ఆగ్రహం చెందుతారు. దీనికి బదులు నేను ఈ రోజే మీతో నిజం చెప్పినట్లయితే మీకు నా మీద కోపం వచ్చినప్పటికీ, అల్లాహ్ నన్ను క్షమిస్తాడన్న ఆశ ఉంది. దైవసాక్షిగా చెబుతున్నాను. నేను మీ వెంట రాలేకపోవడానికి తగు కారణ మేదీ

లేదు. దైవసాక్షి! ఆ సమయంలో నేను మంచి స్థితిలోనే ఉన్నాను. అయినాసరే మీతో కలసి రాలేకపోయాను'.

ఇది విని, దైవప్రవక్త "ఇతను నిజం చెబుతున్నాడు. సరే. ఇక వెళ్ళు. అల్లాహ్ స్వయంగా నీ వ్యవహారంలో ఏదయినా నిర్ణయం తీసుకునే వరకూ నిరీక్షించు" అన్నారు.

నేను లేచి రాసాగాను. నా వెనుకే బనూ సలిమా తెగకు చెందిన కొంత మంది పరుగెత్తుకుంటూ వచ్చి, 'దైవసాక్షి! నీవు లోగడ ఏదయినా తప్పు చేసిన సంగతి మాకు తెలియదు. ఏమయినా నీవు పొరపాటు చేశావు. ఇతరుల మాదిరిగానే నీవు కూడా దైవప్రవక్త(స) ఎదుట ఏదయినా సంజాయిషీ ఇవ్వలేకపోయావా? అలా చేసి ఉంటే, నీ పాపాల మన్నింపునకై దైవప్రవక్త(స) చేసే ప్రార్థనే సరిపోయేది కదా!' అన్నారు. వారు నన్ను ఆ విధంగా నిందిస్తుంటే, తిరిగి వెళ్ళి ప్రవక్త(స) సమక్షంలో ఏదయినా అబద్ధపు సంజాయిషీ ఇచ్చి రావాలన్న దురాలోచన నాలో కలిగింది. 'ఏమిటి, నా లాగే ఇంకా ఎవరయినా ప్రవక్త ఎదుట నిజం చెప్పారా?' అని వాళ్ళను అడిగాను. దానికి వారు, 'అవును. నీలాగే మరో ఇద్దరు మహానుభావులు కూడా విషయాన్ని ఉన్నదున్నట్లుగా చెప్పారు. నీకు లభించిన సమాధానమే వారికీ లభించింది' అన్నారు. 'ఇంతకీ ఎవరు వారు?' అని నేనడిగితే, 'మురారా బిన్ రబీ ఉమరీ, హిలాల్ బిన్ ఉమయ్యా వాఖిఫీ' అని వారు చెప్పారు. వారిద్దరూ సత్పురుషులు, బద్ర్ యుద్ధంలో కూడా పాల్గొన్నవారు. అందుచేత వారి వ్యవహారసరళి నాకు ఆదర్శప్రాయం అయింది. ఆ ఇద్దరు సహాబీల పేర్లు విన్న మీదట నేను సరాసరి నా ఇంటికి వచ్చేశాను.

మా ముగ్గురితో ఎవరూ మాట్లాడవద్దని దైవప్రవక్త(స) తన సహచరులకు తాకీదు చేశారు. తబూక్ యుద్ధంలో పాల్గొనని చాలామందిలో మేము ముగ్గురమే ఈ బహిష్కారానికి గురయ్యాము. జనులు మాకు దూరంగా మసలుకోసాగారు. అందరూ ఒక్కసారిగా మారిపోయారు. మా పట్ల లోకమంతా మారిపోయినట్లు అనిపించింది. యాభై రోజుల వరకూ మేము ఇదే స్థితిలో గడిపాము. నా లాగా ఆంక్షలకు గురైన నా సహచరులిద్దరూ తమ ఇండ్ల నుండి బయటకు రావటమే మానేశారు. వారిద్దరూ అదే పనిగా ఏడుస్తూ ఉండేవారు. కాని నేను మాత్రం ధైర్యంగా బయట తిరిగే వాణ్ణి. ముస్లింలతోపాటు సామూహిక నమాజ్‌లో పాల్గొనేవాణ్ణి. అంగళ్ళ వద్ద నడయాడే వాణ్ణి. కాని నాతో ఎవరూ మాట్లాడేవారు కారు. నేను దైవప్రవక్త(స) నమాజ్ చేసి కూర్చుని ఉండగా ఆయన దగ్గరకు వెళ్ళి సలామ్ కూడా చేసేవాణ్ణి. నా సలామ్‌కు జవాబుగా ఆయన(స) అధరాలు కదలాడుతున్నాయా? లేదా? అని కూడా ఆసక్తిగా గమనించేవాణ్ణి. ఆయన(స) దగ్గరలోనే నిలబడి నమాజ్ చేసేవాణ్ణి. నమాజులోనే ఆయన్ని క్రీగంట చూసేవాణ్ణి. నేను నమాజులో లీనమై ఉన్నప్పుడు దైవప్రవక్త(స) నా వైపు చూసేవారు. మరి నేను ఆయన వైపు చూడగానే, ఆయన తన ముఖారవిందాన్ని మరోవైపు త్రిప్పుకునేవారు. ఈ విధంగా నా యెడల ప్రజల విముఖత నానాటికీ పెరుగుతూ పోయింది.

ఒకరోజు నేను అబూ ఖతాదా (రజి) తోట గోడ పైకెక్కాను. ఆయన నా పినతండ్రి కుమారుడే. ఆయనతో నాకు బాగా చనువు ఉండేది. నేనాయనకు సలామ్ చేశాను. కాని దైవసాక్షి! ఆయన కూడా నా సలామ్‌కు జవాబు ఇవ్వలేదు. 'అబూ ఖతాదా! అల్లాహ్ సాక్షిగా అడుగుతున్నాను. నాకు దైవం, దైవప్రవక్త(స) పట్ల ఎంత ప్రేమ ఉందో నీకు తెలీదా?' అని అడిగాను. కాని ఆయన సమాధానం ఇవ్వలేదు. నేను రెండవసారి కూడా దైవం మీద ఒట్టేసి అదే ప్రశ్న వేశాను. కాని ఆయన ఈసారి కూడా మౌనం వహించారు. నేను మూడవసారి కూడా ఆయన్ని దైవంతోడుగా అదే ప్రశ్న అడిగితే, ఈసారి బదులిచ్చారు– 'ఆ విషయం అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకే తెలుసు' అని.

అంతే, ఈ జవాబు విని నా కళ్ళల్లో నీళ్ళు చిమ్ముకుని వచ్చాయి. నేను గోడ దిగి తిరిగి వచ్చేశాను.

ఒక రోజు నేను మదీనా మార్కెట్టుకు వెళుతుండగా, ఆహార ధాన్యం అమ్మడానికి నగరం వచ్చిన ఒక రైతు, 'కాబ్ బిన్ మాలిక్ ఎక్కడుంటారు?' అని జనుల్ని అడుగుతున్నాడు. జనులు నా వైపు సైగ చేశారు. ఆ వ్యక్తి నా దగ్గరకు వచ్చి గస్సాన్ దేశపు రాజు (క్రైస్తవ రాజు) తరపున వ్రాయబడిన ఒక ఉత్తరాన్ని నాకు ఇచ్చాడు. ఆ ఉత్తరంలో ఇలా లిఖించబడింది– "అమ్మాబాద్! మీ నాయకుడు (ముహమ్మద్–సఅసమ్) మీ పట్ల విపరీతంగా ప్రవర్తిస్తున్నారని మాకు తెలిసింది. దేవుడు మిమ్మల్ని పుట్టించింది అవమానాలు భరించడానికి కాదు. మీరు మా దగ్గరకు వచ్చేసేయండి. మేము మిమ్మల్ని అత్యుత్తమ రీతిలో సత్కరిస్తాము."

ఈ ఉత్తరాన్ని చదివిన మీదట (నిట్టూర్పు విడిచి) ఇది కూడా ఒక పరీక్షే అన్నాను. నేనా ఉత్తరాన్ని పొయ్యిలో పడేసి

కాల్చివేశాను. యాభై రోజుల్లో నలభై దినాలు గడిచిన తరువాత దైవప్రవక్త(స) తన దూతను నా వద్దకు పంపారు. 'నీవు నీ భార్యకూ దూరంగా ఉండాలన్నది దైవప్రవక్త(స) ఆదేశం' అన్నాడతను. 'ఏమిటి, నేనామెకు విడాకులు ఇవ్వాలా? పోనీ నేనేం చెయ్యాలో చెప్పమనండి' అన్నాను. దానికి అతను, 'విడాకులు ఇవ్వనవసరం లేదు. ఆమెకు దూరంగా ఉండు, చాలు' అన్నాడతను. (నిజం చెప్పిన) నా ఇద్దరు మిత్రులకు కూడా ఇదే ఆజ్ఞ లభించింది. 'నీవు నీ పుట్టింటికి వెళ్ళిపో. ఈ వ్యవహారంలో అల్లాహ్ ఏదయినా నిర్ణయం చేసేవరకూ నీవు అక్కడే ఉండు' అని నేను నా భార్యకు చెప్పాను.

కాబ్(రజి) ఇలా అన్నారు: (సంఘ బహిష్కరణకు గురైన) హిలాల్ బిన్ ఉమయ్యా(రజి) ఇల్లాలు దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'దైవప్రవక్తా! హిలాల్ బిన్ ఉమయ్యా ముసలివారై పోయారు. ఆయన దగ్గర సేవకులు కూడా లేరు. నేనాయన సేవలో ఉంటే, అది మీ ఆగ్రహానికి కారణం కాదు కదా!' అని సందేహపడింది. దానికి ఆయన(స), "సేవ చేసుకో. కాని ఆయనతో సమాగమం జరుపరాదు" అని వివరించి చెప్పారు. దానికి ఆమె, 'అయ్యో. ఆయనలో కదిలే, కదిలించే శక్తి కూడా లేదు. అదీగాక- ఆంక్షలు విధించబడిన నాటి నుండి ఆయన కంట వాలికే కన్నీటి ప్రవాహం ఎంతకీ ఆగటంలేద'ని చెప్పింది.

'హిలాల్ బిన్ ఉమయ్యా(రజి) భార్యకు ఆయన సేవలో ఉండే అనుమతిని దైవప్రవక్త(స) ఇచ్చినట్లుగానే మీకూ ఇవ్వవచ్చు. మీరు వెళ్ళి ఆనతి కొరకు అభ్యర్థించండి' అని నా కుటుంబీకులు సలహా ఇచ్చారు. దానికి నేను 'దైవసాక్షిగా! దాని కోసం నేను దైవప్రవక్త(స)ను ఎట్టి పరిస్థితిలోనూ అభ్యర్థించను. నేను యువకుణ్ణి. అనుమతి కోసం వెళితే ఆయన(స) ఏమంటారో తెలీదు' అన్నాను.

ఈ విధంగా మరో పది రోజులు పూర్తయ్యాయి. యాభయ్యవ రోజు నేను ఫజ్ర్ నమాజ్ చేసి, నా ఇంటి కప్పుపై కూర్చుని ఉన్నాను. అల్లాహ్ ప్రస్తావించినట్లుగా నా ప్రాణం లోలోపలే కొట్టుకుంటోంది. భూమి ఎంతో విశాలంగా ఉండి కూడా నా కొరకు ఇరుకైపోయింది. సరిగ్గా అదే సమయంలో నేను ఎలుగెత్తి పిలిచేవాని ఒక పిలుపును విన్నాను. సలా కొండపైకెక్కి అతను, 'ఓ కాబ్ బిన్ మాలిక్! నీకు శుభవార్త!' అని పిలుస్తున్నాడు. అంతే, నేను సాష్టాంగపడిపోయాను. నాపైన ఉన్న ఆంక్షలు ఎత్తివేయబడ్డాయని నాకు అర్థమయింది. ఫజ్ర్ నమాజ్ తర్వాత దైవప్రవక్త(స), దైవ సన్నిధిలో మా పశ్చాత్తాపం ఆమోదించబడిందని తెలియజేశారు. నాకు ఈ శుభవార్త వినిపించడానికి జనులు పరుగులు తీస్తూ రాసాగారు. నా మిత్రులిద్దరి వద్దకు కూడా వెళ్ళి ఈ శుభవార్త వినిపించారు. ఒక వ్యక్తి (జుబైర్ బిన్ అవ్వామ్-రజి) గుర్రమెక్కి దౌడు తీస్తూ వస్తున్నారు. అటు అస్లమ్ తెగకు చెందిన ఒక సహచరుడు కొండపైకెక్కి దిక్కులు పిక్కటిల్లేలా పిలుస్తున్నారు. ఆ పిలుపు గుర్రపు వేగం కన్నా ఎక్కువగా నా కర్ణపుటాలను తాకింది. సలా కొండ పైకెక్కి పిలుపు ఇచ్చిన సహాబీ నన్ను సమీపించగానే, నా ఒంటిపైనున్న రెండు వస్త్రాలను తీసి- ఆ సంతోషంలో ఆయనకు ఇచ్చేశాను. దైవసాక్షిగా! ఆ సమయంలో ఆ రెండు వస్త్రాలు తప్ప నా దగ్గర (కానుకగా ఇవ్వదగిన) మరో వస్తువు లేదు. తరువాత నేను (అబూ ఖతాదా-రజి)ను అడిగి రెండు వస్త్రాలు తీసుకుని తొడుక్కున్నాను.

ఆ తర్వాత నేను దైవప్రవక్త(స) సన్నిధికి బయలుదేరాను. జనులు తండోప తండాలుగా తరలి వచ్చి నా పశ్చాత్తాపం స్వీకృతి పట్ల శుభాకాంక్షలు తెలుపుకోసాగారు. 'దైవ సన్నిధిలో ఆమోదముద్ర పొందిన నీ పశ్చాత్తాపం శుభమవుగాక!' అని పలుకుతున్నారు. చివరకు నేను మస్జిద్‌లో ప్రవేశించాను. అక్కడ ప్రవక్త మహనీయులు(స) కూర్చుని ఉన్నారు. నలువైపులా సహచరమాన్యుల సందోహం ఉంది. తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజి) నా వైపునకు దూసుకువచ్చి కరచాలనం చేశారు. నాకు శుభాకాంక్షలు తెలిపారు. దైవసాక్షిగా! (అక్కడ ఉన్న) ముహాజిర్లలో ఆయన ఒక్కరు తప్ప వేరెవరూ నా రాకపై లేచి నిలబడలేదు. తల్హా (రజి) యొక్క ఈ ఉపకారాన్ని నేను ఎన్నటికీ మరువలేను.

కాబ్(రజి) ఇలా అన్నారు: నేను దైవప్రవక్త(స)కు సలామ్ చేశాను. (తన మోముపై సంతోషం తొణికిసలాడుతుండగా) ఆయన(స) ఇలా అన్నారు: "ఈ శుభకరమైన రోజు నీకు శుభమవుగాక! నీ జీవిత కాలంలో ఇది అత్యంత శుభకరమైన దినం." 'దైవప్రవక్తా! ఈ శుభవార్త మీ తరపున వినిపించబడుతోందా? లేక అల్లాహ్ తరపునా?' అని నేను అడిగితే, "లేదు. అల్లాహ్ తరపు నుండే" అని ఆయన(స) బదులిచ్చారు. దైవప్రవక్త(స)కు ఏదన్నా విషయంపై సంతోషం కలిగితే ఆయన ముఖారవిందం పున్నమి చంద్రునిలా ప్రకాశించేది. ఆయన మోమును గని మేము ఆ విషయాన్ని అర్థం చేసుకునేవారం.

తరువాత నేను ఆయన(స) ఎదుట కూర్చుని, 'దైవప్రవక్తా! నా పశ్చాత్తాపం స్వీకరించబడిన సంతోషంలో నేను నా ఆస్తినంతటినీ దైవం, దైవప్రవక్త మార్గంలో దానం చేసెయ్యనా?' అని విన్నవించుకున్నాను. దానికి ఆయన(స), "అంతా వద్దు. నీ కోసం కూడా కొంత ఉంచుకోవటం మంచిది" అన్నారు. 'అలాగైతే ఖైబర్‌లో నాకు లభించిన వాటాను నా దగ్గర ఉంచుకుంటాన'ని అన్నాను. తరువాత ఇలా విన్నవించుకున్నాను– 'దైవప్రవక్తా! నిజం చెప్పినందువల్ల అల్లాహ్ నాకు మోక్షం ప్రసాదించాడు. ఇప్పుడు నేను నా పశ్చాత్తాపం ఆమోదించబడిన సంతోషంలో నేను చేసే ప్రతిజ్ఞ ఏమిటంటే, నేను జీవించి ఉన్నంత కాలం నిజం తప్ప మరొక మాట పలకను.'

అంతే, దైవప్రవక్త(స) సమక్షంలో నేను ప్రతిజ్ఞ చేసిన నాటి నుండీ, నిజం చెప్పిన కారణంగా అల్లాహ్ నాకు అనుగ్రహించినంతగా మరే ముస్లింకు కూడా అనుగ్రహించినట్లు నేనెరుగను. కనీసం అబద్ధం చెప్పాలన్న ఆలోచన కూడా నా మదిలో కలుగలేదు. మిగిలిన జీవితంలో నన్ను ఇలాగే అల్లాహ్ (అబద్ధం నుండి) సురక్షితంగా ఉంచుతాడని ఆశిస్తున్నాను. అల్లాహ్ (మా గురించి) తన ప్రవక్తపై దివ్య వచనాలను అవతరింపజేశాడు–

"అల్లాహ్ క్షమించాడు ప్రవక్తనూ, బహుకష్టకాలంలో ప్రవక్తకు తోడ్పడిన ముహాజిరులనూ, అన్సారులనూ. వారిలో కొందరి హృదయాలు వక్రత్వం వైపునకు మొగ్గినప్పటికీ (కాని వారు ఆ వక్రత్వాన్ని అనుసరించకుండా ప్రవక్తకు తోడ్పడినప్పుడు) అల్లాహ్ వారిని క్షమించాడు. నిస్సందేహంగా ఆయన వారి పట్ల వాత్సల్యంతో, కనికరంతో వ్యవహరించాడు. ఇంకా వ్యవహారం వాయిదా వెయ్యబడిన ఆ ముగ్గురిని కూడా ఆయన క్షమించాడు. ఇంత పెద్ద వైశాల్యం కలిగి ఉండి కూడా, భూమి వారికి ఇరుకైపోయింది. వారి ప్రాణాలు కూడా వారికి భారమై పోయాయి. అల్లాహ్ నుండి తమను కాపాడుకోవటానికి స్వయంగా అల్లాహ్ కారుణ్యం తప్ప వేరే ఆశ్రయం ఏదీ లేదని వారు తెలుసుకున్నారు. అప్పుడు అల్లాహ్ కనికరంతో వారి వైపునకు మరలాడు, వారు ఆయన వైపునకు మరలి వచ్చేటందుకు. నిశ్చయంగా ఆయన చాలా క్షమించేవాడూ, కరుణించేవాడూను. విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యవంతులకు తోడ్పడండి." *(అత్ తౌబా : 117–119)*

దైవసాక్షిగా! అల్లాహ్ తరపు నుండి సన్మార్గ భాగ్యం లభించిన మీదట, దైవప్రవక్త(స) సమక్షంలో నిజం చెప్పటం కన్నా గొప్ప వరం నా దృష్టిలో మరొకటి లేదు. ఇది కేవలం దైవ కటాక్షం. నేను అబద్ధం చెప్పి, నన్ను నేను నాశనం చేసుకోలేదు. ఇతరులు అబద్ధం చెప్పి నాశనమయ్యారు. దైవవాణి అవతరిస్తున్న రోజుల్లో అల్లాహ్ అబద్ధం చెప్పేవారిని అధిక్షేపించినంత తీవ్రంగా మరెవరినీ అధిక్షేపించలేదు.

"నీవు మరలి వచ్చిన తరువాత వారు నీ ముందు ప్రమాణాలు చేస్తారు, నీవు వారిని ఉపేక్షించాలని. కనుక నీవు వారిని తప్పకుండా ఉపేక్షించు. ఎందుకంటే, వారొక మాలిన్యం వంటివారు. వారి అసలు స్థానం నరకం. అది వారి సంపాదనకు ప్రతిఫలంగా వారికి లభిస్తుంది. వారు నీ సమక్షంలో ప్రమాణాలు చేస్తారు, వారికి నీవు ప్రసన్నుడవు కావాలని. వాస్తవానికి, ఒకవేళ నీవు వారి పట్ల ప్రసన్నత చూపినా అల్లాహ్ మటుకు అటువంటి విద్రోహులకు ఎన్నటికీ ప్రసన్నుడు కాడు".

*(తౌబా : 95,96)*

కాబ్(రజి) ఇలా అన్నారు: మేము ముగ్గురం దైవప్రవక్త(స) సమక్షంలో ప్రమాణాలు చేసిన వారి నుండి వేరయ్యాము. దైవప్రవక్త(స) వారు చెప్పేదానిని అంగీకరించి, వారి నుండి ప్రమాణం తీసుకున్నారు. వారి మన్నింపునకై ప్రార్థించారు కూడా. అయితే దైవప్రవక్త(స) మా వ్యవహారాన్ని దైవానికే అప్పగించారు. అల్లాహ్ స్వయంగా దాని తీర్పు చేశాడు. దివ్యవచనం– "వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురిని కూడా ఆయన క్షమించాడు" (9: 118)లోని అర్థం ఇదే. దీని అర్థం మేము యుద్ధానికి వెనుకంజ వేశామన్నది కాదు. (అబద్ధపు) ప్రమాణాలు చేసి, సాకులు చెప్పిన వారి నుండి మేము వేరయ్యాము అన్నదే దీని అసలు అర్థం.[1]

277-1. సుబ్‌హానల్లాహ్! వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురు సహచరమాన్యులు బలహీన విశ్వాసం కల ముస్లింలు కారు. పైగా వారు నికార్సయిన ముస్లింలు. ఆ ముగ్గురు మహనీయులు అధర్మపు సొమ్ము తినలేదు. రక్తపాతం సృష్టించలేదు. అశ్లీల కార్యాలకు ఒడిగట్టలేదు. కాని నిజం చెప్పినందుకు పడిన తాత్కాలిక శిక్షను అనుభవించి ఊర్ధ్వలోకాల నుండి శుభవార్త అందుకున్నారు.

హజ్రత్ కాబ్ బిన్ మాలిక్(రజి) అన్సార్ సహాబీ. 'రెండవ బైఅతె అఖబా'లో పాల్గొన్న ధన్యులు. 77 ఏళ్ళ వయసులో హిజ్రీ 50లో మరణించారు.




- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**గత సంచిక తరువాయి...**

## మహనీయులకు మరణం లేదా?

"భూమండలంపై ఉన్నవారంతా నశించిపోవలసినవారే- ఎప్పటికీ మిగిలి ఉండేది ఘనత, గౌరవం గల నీ ప్రభువు అస్తిత్వం మాత్రమే" (సూరతుర్ రహ్మాన్:26-27)

కొంత మంది ప్రజలు ప్రవక్తలకు, పుణ్యాత్ములకు, షహీదులకు మరణం లేదు. వారు తమ సమాధులలో సజీవంగా ఉంటారనీ భావిస్తారు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) చనిపోలేదని నమ్మేవారు కూడా చాలా మంది ఉన్నారు. కాని వారి గురించి అల్లాహ్ ఇలా తెలియజేసాడు:

**"ముహమ్మద్ కేవలం ఒక సందేశహరుడు మాత్రమే! వాస్తవానికి అతనికి పూర్వం అనేక సందేశహరులు గడిచిపోయారు. ఏమీ? ఒకవేళ అతను చనిపోతే లేదా చంపబడితే మీరు వెనుకంజ వేసి మరలిపోతారా? వెనుకంజ వేసి మరలిపోయేవాడు అల్లాహ్‌కు ఏ మాత్రం నష్టం కలిగించలేడు. కృతజ్ఞతాపరులైన వారికి అల్లాహ్ తగిన ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు" (ఆలె ఇమ్రాన్: 144)**

మరొక చోట అల్లాహ్ ఇలా తెలియజేసాడు:

**(ఓ ముహమ్మద్!) నిశ్చయంగా, (ఒక రోజు) నీవు మరణిస్తావు. నిశ్చయంగా, వారు కూడా మరణిస్తారు. ఆ తరువాత నిశ్చయంగా పునరుత్థాన దినమున మీరంతా మీ ప్రభువు సమక్షంలో, మీ వ్యాజ్యాలను వినిపిస్తారు" (అజ్ జుమర్: 30-31)**

ముహమ్మద్(సల్లం) ఒక దైవప్రవక్త మాత్రమే. అంటే దైవదౌత్యం మూలంగా ఆయనకు ఈ లోకంలో విశిష్ఠత ప్రాప్తించింది. అంతమాత్రాన ఆయన మానవ సహజమైన విషయాలకు అతీతులు కారు. కనుక ఆయనకు మరణం కూడా అసంభవమైన విషయమేమీ కాదు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణించిన రోజు హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) ఇలా అన్నారు: "ఎవరైతే ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ఆరాధిస్తారో, వారు ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లం) గతించిపోయారని తెలుసుకోవాలి. కాని ఎవరైతే కేవలం అల్లాహ్‌ను ఆరాధిస్తారో, ఆయన నిత్యుడు, సజీవుడు అని తెలుసుకోవాలి" (బుఖారీ)

గమనిక: ప్రవక్త ఈసా (అలైహిస్సలామ్) ప్రళయానికి దగ్గరలో ఆకాశం నుండి దిగివచ్చి ఈ భూలోకంలో కొన్ని సంవత్సరాలు ఉండి సహజ మరణం పొందుతారు అని ప్రామాణిక హదీసు ద్వారా తెలుస్తుంది.

## పుణ్యాత్ములు, షహీదులు:

కొంత మంది పుణ్యాత్ములకు, షహీదులకు మరణం లేదు. వారు తమ సమాధులలో సజీవంగా ఉంటారనీ భావిస్తారు. అనేక మంది సమాది చేయబడిన పుణ్యాత్ములు మన మాటలను, మన దుఆలను వింటారు, మన కష్టాలను దూరం చేస్తారు, మనం వారిని వేడుకుంటే వారు అల్లాహ్ వద్ద మనకోసం వారు సిఫారసు చేస్తారనే విశ్వాసాలకు గురికాబడి, ఆ సమాధుల వద్దకు పోయి, అనేక విధాలుగా వారిని ఆరాధిస్తారు. తమ విశ్వాసాలకు ఆధారంగా ఖుర్‌ఆన్ నుండి కొన్ని ఆయతులను చూపుతారు:

"అల్లాహ్ మార్గంలో చంపబడినవారిని మృతులు అని అనకండి. వారు బ్రతికే ఉన్నారు. కాని ఆ విషయం మీకు అర్థం కాదు." (సూరతుల్ బఖరా: 154)

మరొక చోట ఇలా ఉంది:

"అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని సుతరామూ మృతులుగా తలపోయకండి. వారు జీవులు. వారికి తమ ప్రభువు వద్ద ఆహారం. ఇవ్వబడుతుంది" (ఆలె ఇమ్రాన్:169)

అల్లాహ్ మార్గంలో అమరగతి నొందిన వారిని మృతులని అనకూడదు. ఎందుకంటే వారి గౌరవార్థం ఇలాంటి మాటలు అనరాదన్న మాట! ఈ సమాధి జీవితాన్ని "బర్జఖ్ జీవితం" అంటారు. దీన్ని మనం అర్థం చేసుకోలేము. ఈ జీవితం వివిధ స్థాయిల్లో ప్రవక్తలకు, విశ్వాసులకు చివరికి అవిశ్వాసులకు కూడా ఇవ్వబడుతుంది. అమరగతుని ఆత్మ - కొన్ని ఉల్లేఖనాల ప్రకారం విశ్వాసి ఆత్మ కూడా ఒక పక్షి రూపంలో ఉండి స్వర్గంలో తాను కోరినచోట విహరిస్తూ ఉంటుంది. (ఇబ్నె కసీర్, తఫ్సీర్ అహ్సనుల్ బయాన్ తెలుగు: 105)

మరి ఆ జీవితాన్ని స్థూలంగా ఎలా అర్థం చేసుకోవాలి అన్నది ప్రశ్న. సమాధులలోకి వారి ఆత్మలు తిరిగి పంపబడతాయనీ, దైవానుగ్రహాలను ఆస్వాదిస్తూ వారు అందులో హాయిగా ఉంటారని కొంత మంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. స్వర్గంలో పండ్లు ఫలాల సువాసనను పీల్చుతూ వారు సుఖంగా, సంతృప్తికరంగా ఉంటారని మరి కొందరు వ్యాఖ్యానించారు. అయితే హదీసు ద్వారా మూడో విషయం కూడా తెలియవస్తుంది. అదేమిటంటే వారి ఆత్మలు పచ్చని పక్షుల ఉదరాల్లోకి ప్రవేశపెట్టబడతాయి. అవి స్వర్గంలో తింటూ త్రాగుతూ, అందలి అనుగ్రహాలను తనివితీరా ఆస్వాదిస్తూ ఉంటాయి. (ఫత్‌హుల్ ఖదీర్ - సహీహ్ ముస్లిం, తఫ్సీర్ అహ్సనుల్ బయాన్ తెలుగు: 314)

పైన ఇవ్వబడిన రెండు ఆయతులలో కూడా అల్లాహ్ తెలియ జేసిన విషయం ఏమనగా పుణ్యాత్ముల స్వర్గ జీవిత వాస్తవికత గురించి మరియు వారు పొందే అనుగ్రహాల వాస్తవికత గురించి మాత్రమే. కాని వారు మన మాటలు లేక మన మొరలు, మన దుఆలు వింటారు, మనకు సిఫారసు చేస్తారనే విషయం పూర్తి అవాస్తవం. పైగా వారి జీవితం పరలోక జీవితం. భూలోక జీవితానికి సంబంధించినది కానే కాదు. ఆ జీవితాన్నే 'బర్జఖ్ జీవితం' అంటారు.

## ప్రవక్త ముహమ్మద్ (స) పై 'దరూద్ దుఆ' చదవడం ప్రతి ముస్లింపై ఉన్న ప్రాథమిక బాధ్యత

అల్లాహ్ ఖుర్‌ఆన్ గ్రంథంలో ఇలా ఆదేశించాడు: "నిశ్చయంగా అల్లాహ్ ఆయన దూతలు కూడా దైవప్రవక్తపై కారుణ్యాన్ని పంపిస్తున్నారు. ఓ విశ్వాసులారా! మీరు కూడా అతనిపై దరూద్ పంపండి. అత్యధికంగా అతనికి 'సలాములు' పంపుతూ ఉండండి." (సూరతుల్ అహ్జాబ్:56)

అల్లాహ్, దైవదూతలు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉన్నత సోపానాల కోసం ప్రార్థిస్తున్నారు. కాబట్టి భూవాసులు కూడా ఆయన కోసం ప్రార్థిస్తూ ఉండాలనీ, ఆయనకు 'సలాం' పంపిస్తూ ఉండాలని అల్లాహ్ ఆదేశించాడు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "జుమా రోజు నాపై అత్యధికముగా 'దరూద్ దుఆ' చదవండి. మీ దరూద్ నా వద్దకు చేర్చబడుతుంది." (అబూ దావూద్, ఇబ్నుమాజా)

సహీహ్ బుఖారీలో ఒక హదీసు ఇలా ఉంది: "దైవప్రవక్తా! (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'సలాం' పంపే పద్ధతి మాకు తెలిసిందే (అంటే అత్తహియ్యాత్ పఠించే సమయంలో 'అస్సలాము అలైక అయ్యుహన్నబియ్యు....' అని చదువుతాము'. కాని మేము 'దరూద్' ఎలా పంపేది?" అని ప్రియ సహచరులు (రజియల్లాహు అన్హు) సందేహపడగా, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) నమాజులో పఠించే 'దరూదే ఇబ్రాహీం'ను నేర్పారు."

హదీసు గ్రంథాలలో క్లుప్తమైన పదాలు కూడా ఉన్నాయి, అవి: "సల్లల్లాహు అలా రసూలిల్లాహి వసల్లం" ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) కోసం ప్రతి అజాన్ పలుకుల తరువాత 'దరూద్ దుఆ'తో సహా 'వసీలా దుఆను చదువు తాము. "ఎవరైతే ఆ దుఆను ప్రతి అజాన్ తరువాత చదువుతారో వారి కొరకు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రళయ దినాన సిఫారసు చేస్తారు." (బుఖారీ:579)

కాని "అస్సలాతు వస్సలాము అలైక యా రసూలల్లాహ్" అని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్వయంగా వింటున్నారు, ఆయన బ్రతికే ఉన్నారు, మన సభలలో, సమావేశాలలో ప్రత్యక్షమవుతారు అనే నమ్మకంతో పంపే సలాము గానీ, అలాగే మార్కెట్‌లో దొరికే రూఢి కానీ దరూద్ కాని ధర్మసమ్మతం కాదు.

### పుణ్యాత్ముల మరణానంతరం వారి ఉన్నత స్థానాల కొరకు దుఆ చేయడం ధర్మం

మనం సహాబా పట్ల, తాబయీన్ల పట్ల, పుణ్యాత్ముల పట్ల అల్లాహ్ ఆజ్ఞకు కట్టుబడి ఉన్న ముస్లిములందరికీ ఉన్నత స్థాయిని ప్రసాదించమని ప్రార్థనలు చేస్తూ ఉండాలి. కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు:

వారు ఇలా వేడుకుంటారు: "ఓ మా ప్రభూ! మమ్మల్ని, మా కంటే ముందు విశ్వసించిన మా సోదరులను క్షమించు. మా హృదయాలలో విశ్వాసుల పట్ల 'అక్కసు'ను కలిగించకు. ఓ మా ప్రభూ! నిశ్చయంగా నీవు చాలా కనికరించేవాడవు, అపార కరుణాప్రదాతవు." (సూరతుల్ హష్ర్:10). పుణ్యాత్ముల కొరకు అల్లాహ్ ఉన్నత స్థానాలు ప్రసాదించాలని మనం ప్రార్థించాలి. కాని ప్రవక్తలను లేక పుణ్యాత్ములను మొరపెట్టుకోవడం తగదు. వారు మన నష్టాలలో, కష్టాలలో ఆదుకుంటారనే షిర్క్, బిద్అత్ విశ్వాసాలు 'అహ్లుసున్నత్ వల్ జమాఅత్'కు సంబంధించినవి కానే కావు.

[redacted]

# ఇజ్రాయెల్ దాడిలో పిల్లలను కోల్పోయిన ఓ వైద్యుడి దీన గాథ..

హమాస్ పేరుతో ఇజ్రాయెల్ రక్తపుటేరులు పారిస్తున్నది. గాజాపై భీకర దాడులకు పాల్పడుతూ పాలస్తీనియన్లను పొట్టన పెట్టుకుంటున్నది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం చోటుచేసుకున్న ఘటన అందరినీ కంటతడి పెట్టిస్తున్నది. గాజాపై ఇజ్రాయెల్ జరిపిన సైనికదాడిలో తన పది మంది సంతానంలో తొమ్మిది మందిని కోల్పోయిన ఓ వైద్యుడు ప్రస్తుతం దవాఖానాలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో (ICU) చికిత్స పొందుతూ, చావు బతుకుల మధ్య ఉన్నాడు. ఇజ్రాయెల్ సైన్యం ఖాన్ యూనిస్‌పై వైమానిక దాడి జరిపింది. గాజాకు చెందిన హమ్ది అల్-నజ్జర్ అనే డాక్టర్ తన 10 మంది పిల్లలతో పాటు ఇంట్లో ఉన్నప్పుడు ఈ దాడి జరగడంతో.. వారిలో తొమ్మిదిమంది చిన్నారులు మృతి చెందారు. డాక్టర్ నజ్జర్‌తోపాటు ఒక చిన్నారి ప్రాణాలతో బయటపడ్డారు.

నజ్జర్ తీవ్రంగా గాయపడటంతో ప్రస్తుతం దక్షిణ గాజా సమీపంలోని నాజర్ దవాఖానలో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆయన కడుపు, ఛాతీలో రక్త స్రావం అవుతున్నదని, దానిని నియంత్రించేందుకు రెండు సార్లు ఆపరేషన్లు జరిగాయని అబ్దుల్ అజీజ్ అల్-ఫర్రా అనే డాక్టర్ వెల్లడించారు. అతని తలకు కూడా తీవ్రగాయం అయిందని, ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలిపారు.



నజ్జర్ భార్య ఆలా కూడా డాక్టర్. దాడి సమయంలో ఆమె ఇంట్లో లేకపోవడంతో బతికిపోయారు. గత 20 నెలలుగా హమాస్, ఇజ్రాయెల్ పోరులో గాయపడిన పాలస్తీనియన్లకు తన భర్తతోపాటు ఆమె వైద్య సేవలు అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆమె ఇంటికి చేరుకుని విగత జీవులుగా పడివున్న తన పిల్లలను చూసి షాకయ్యారని నజ్జర్ సోదరి తహని యహ్యా తెలిపారు. కాగా, వారి పది మంది సంతానంలో ఓ బాలుడు మాత్రమే బతికాడని, అతనికి కూడా తీవ్ర గాయాలైనప్పటికీ ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. మృతిచెందినవారంతా ఒకటి నుంచి 12 ఏండ్ల వయస్సు లోపువారేనని పేర్కొన్నారు.



# కవలల 'వైద్య' విజయం...

## 'జెడ్' జనరేషన్‌కు స్ఫూర్తిదాయకం

- తహూరా సిద్దీఖా

సాధారణంగా కవలలు భావోద్వేగాలు మొదలుకొని విజయాల వరకూ అన్నీ పంచుకుంటారని ఒక ప్రాచుర్యం పొందిన నమ్మకం ఉంది. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన కవలలు రిబా, రహిన్ ఎంబీబీఎస్ పరీక్షల్లో ఒకే మార్కులు సాధించడం ద్వారా చరిత్ర సృష్టించారు. "కొన్నిసార్లు అద్భుతాలు జంటగా వస్తాయి" అన్న బ్రిటన్ వ్యాపారవేత్త సర్ రిచర్డ్ చార్లెస్ నికోలస్ బ్రాన్సన్ మాటను ఈ ఘటన గుర్తుకు తెస్తుంది. నిజమే కదా! ఈ అక్కా చెల్లెళ్లు తమ వైద్య విద్య కోర్సును 66.8 శాతం (లేదా 935) మార్కులతో విజయవంతంగా పూర్తి చేశారు.

ఒకే ఊరిలో పుట్టి, పెరిగి, చదువుకున్న ఈ కవలలు ఒకే మార్కులు సాధించడం నిజంగా ఆశ్చర్యమే. ఏ విధంగా చూసినా రిబా, రహిన్ అనే ఈ కవల సోదరీమణుల విజయగాథ వైద్య విద్య చరిత్రలో ఒక అద్భుతం!

వీరిద్దరూ గుజరాత్‌లోని వడోదర నగరంలోని GMERS మెడికల్ కాలేజీలో చదువుకున్నారు. వీరి తల్లి గుల్షాద్ బాను అన్నీ తానై వీరిద్దరినీ పెంచారు. రహిన్ సర్జన్ కోర్సు పట్ల ఆసక్తి చూపుతుంటే, రిబా మెడిసిన్ విభాగంపై దృష్టి పెట్టారు. 24 ఏళ్ల వయస్సు కలిగిన వీరిద్దరి చదువు, జీవిత నిర్ణయాలు ఇప్పటివరకు దాదాపు ఒకేలా ఉన్నాయి.

ఒంటరి తల్లి అయిన గుల్షాద్ బాను తన కూతుళ్ళిద్దరినీ ఒక లక్ష్యంతో పెంచారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, తల్లి కలను నిజం చేయాలన్న సంకల్పంతో ఈ సోదరీమణులు ముందుకు సాగారు. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా సొంతంగా చదువుకొని నీట్ (NEET) పరీక్ష రాశారు. ఇందులో రిబా 97%, రహిన్ 97.7% మార్కులు సాధించారు. స్కూల్లోనూ వీరిద్దరూ దాదాపు ఒకే మార్కులు పొందడం ఆసక్తికరమైన విషయం.

వైద్య విద్యను అభ్యసించాలన్న ప్రేరణ వీరికి వీళ్ల మామయ్య నుంచి లభించింది. ఆయన కూడా వైద్యుడే. ఆయన ప్రోత్సాహంతో వీరు ఎంబీబీఎస్ కోర్సుకు అర్హత పొందారు. వీరిద్దరూ క్లాస్‌మేట్స్, బెంచ్‌మేట్స్, రూమ్‌మేట్స్ కూడా. తమ తల్లి, అమ్మమ్మ, తాతయ్యల మద్దతుతో వారు వైద్య విద్యను పూర్తి చేశారు.

రహిన్, రిబా మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ విద్య, ఆర్థిక సాయంతో తమ చదువును ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేశామని చెప్పారు. "అల్లాహ్ కృప" వల్ల తమకు వైద్య విద్యలో విజయం లభించిందని చెప్పారు. ఈ కవలలిద్దరూ ఇతర విద్యార్థులకు, ముఖ్యంగా అమ్మాయిలకు ఆదర్శప్రాయంగా నిలిచారు.

ఇప్పటి జనరేషన్‌లోని యువతకు ఇన్‌స్టాగ్రామ్ లేదా ఫేస్‌బుక్ ఖాతాలు లేకపోవడం అసాధారణ విషయంగా మారింది. కానీ ఈ సోదరీమణులు చదువుల కోసం సోషల్ మీడియాకు దూరంగా ఉన్నారు. అంతే కాకుండా ఇద్దరిదీ ఒకే సెల్‌ఫోన్. ఇద్దరికీ ఉన్న స్నేహితులు కొందరే.. అది కూడా ఇద్దరికీ సమానమే. సోషల్ మీడియాలో మన మెదళ్లను తొలిచే చెత్త విషయాలపై ఆసక్తి చూపకుండా, వార్తా వెబ్‌సైట్లను చూడటం ద్వారా వర్తమాన వ్యవహారాల జ్ఞానాన్ని పెంచుకున్నారు.

చివరిగా ఈ కవలలిద్దరూ ఇలా చెప్పారు: "ముందుగా దేవుణ్ణి నమ్మండి. మీరు నిరుత్సాహపడినప్పుడు, దేవుడున్నాడని విశ్వసించండి". ఈ కవలలు తమ లక్ష్య సాధనతో ఒకే తోటలోని పువ్వుల్లా విజయ సౌరభాలు వెదజల్లుతూ ఉన్నారు.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పొదరాయి
గీటురాయి
వారపత్రిక

# విశిష్ట ఆరాధన ఖుర్బానీ



**షరీఫా, విజయవాడ**

**నేటి** ఆధునిక మానవుడు అన్ని రంగాలలో అభివృద్ధిని కాంక్షిస్తూ కృత్రిమ మేథతో అద్భుతాలు సృష్టించే స్థాయికి ఎదిగాడు. కాని మన సృష్టికర్త గురించి విశాల హృదయంతో, వివేకంతో ఆలోచన చేయకపోవడం శోచనీయం. సూత్రప్రాయంగా దేవుడు ఒక్కడే అని భావిస్తూనే ఆచరణలో మాత్రం అనేకమంది ఆ ఏకేశ్వరుణ్ణి ఆరాధించలేకపోవటం బాధాకరం.

పండుగలు మన జీవన స్రవంతిలో ఒక భాగమై మన సంస్కృతీ వికాసానికి దోహదం చేస్తాయి. జిల్‌హజ్జ మాసం రాగానే మనకు అందరికీ హజ్ యాత్ర గుర్తుకు వస్తుంది. ఆ హజ్ యాత్రలో అడుగడుగునా ఇబ్రాహీమ్(అ) చూపిన జీవన విధానమే ఆదర్శంగా నిలుస్తుంది. ప్రవక్తల పితామహునిగా పేరుగాంచిన ఇబ్రాహీమ్(అ) యూదులు, క్రైస్తవులు, ముస్లిములకు కూడా మూల పురుషుడు. ఈ నెలలో జరుపుకునే ఈదుల్ అజ్‌హా (బక్రీదు) పండుగ త్యాగాలకు చిహ్నం. ఖుర్బానీ అంటే జంతు బలి అని భావిస్తారు. కానీ ఖుర్బానీ అంటే త్యాగం. అంధ విశ్వాసా లను, పూర్వీకుల ఆచారాలను గుడ్డిగా అనుసరించకుండా తనదైన విచక్షణా జ్ఞానంతో నిజదైవాన్ని గుర్తించారు ఇబ్రాహీం(అ). ప్రకృతిని పరిశీలించి, పరిశోధించిన ఇబ్రాహీమ్(అ) సూర్యచంద్రాదులను, ఇతర ప్రకృతి వనరులను ఆరాధించరాదని, వాటిని సృష్టించిన సృష్టికర్తనే విశ్వసించి ఆరాధించాలనే ఏకేశ్వరవాదాన్ని బోధించారు. దైవగ్రంథం దివ్యఖుర్‌ఆన్ ఇబ్రాహీం (అస) గాథను ప్రస్తావించింది.

నిస్సందేహంగా అతను సత్యసంధుడైన వ్యక్తి. ఒక దైవప్రవక్త. (వారికి ఆ సందర్భాన్ని జ్ఞాపకం చెయ్యి) అప్పుడు అతను తన తండ్రితో ఇలా అన్నాడు. “తండ్రీ! వినలేని, కనలేని, మీ ఏ పనిని చేసి పెట్టలేని వాటిని మీరు ఎందుకు ఆరాధిస్తున్నారు? తండ్రి! నా వద్దకు వచ్చిన జ్ఞానం మీ వద్దకు రాలేదు. మీరు నన్ను అనుసరించండి. నేను మీకు సరైన మార్గం చూపుతాను’ (మర్యమ్ : 41-43) అని వివరించింది.

కాని ఇబ్రాహీం(అ) తండ్రి ‘ఆజర్’ తన కుమారుని సత్యబోధనను అంగీకరించక మత భ్రష్టునిగా భావించి ఆనాటి చక్రవర్తి నమ్రూద్ దర్బారులో దోషిగా ప్రవేశపెట్టాడు. నిరంకుశ రాజు అయిన నమ్రూద్ ముందు “నా ప్రభువు సూర్యుణ్ణి తూర్పున ఉదయింప జేసి, పడమరన అస్తమింపజేస్తాడు. నీవు దానికి వ్యతిరేకంగా చేసి చూపమని ఎంతో ధైర్యంగా సవాలు చేశారు ఇబ్రాహీమ్(అ). ఇబ్రాహీమ్(అ) సవాలును స్వీకరించలేని ఆ నిరంకుశ చక్రవర్తి తన అధికార దర్పంతో భగభగ మండే అగ్నిగుండంలో పడతోయండని ఆజ్ఞాపించాడు. నికార్సయిన దైవ విశ్వాసి అయిన ఇబ్రాహీమ్ (అ) ఆ అగ్నిగుండంలో దూకటానికి కూడా భయపడ లేదు. సూర్యునికి వెలుగును, పువ్వులకు పరిమళాన్ని, నీటికి ప్రవహించే శక్తిని, గాలికి వీచే గుణాన్ని, జనన మరణాలను ప్రసాదించే ఆ సృష్టికర్త అల్లాహ్‌యే అగ్నిని పూలవనంగా మార్చాడు. ఈ సంఘటన మనలో దైవ విశ్వాసంతో ఎంతటి ఆపదనైనా అధిగమించవచ్చు అనే ఆత్మ విశ్వాసాన్ని ప్రతి విశ్వాసికి కలిగిస్తుంది.

దైవ స్నేహితుని(ఖలీలుల్లాహ్)గా చేసుకోబడిన ఇబ్రాహీమ్(అ)కు వృద్ధాప్యం వరకు సంతానం కలగలేదు. దైవం పట్ల అచంచల విశ్వాసం గలవారు ఎన్నడూ నిరాశ చెందరు. తన తదనంతరం ఏకేశ్వరవాదాన్ని ప్రపంచమంతా ప్రజ్వలింపజేయటానికి ఉత్తమ సంతానం ప్రసాదించమని వేడుకుంటూనే ఉండేవారు ప్రవక్త ఇబ్రాహీమ్(అ). ఆ తర్వాత రెండో భార్య హాజిరా ద్వారా ఇస్మాయీల్(అ) జన్మించారు. ముద్దుల తనయుణ్ని, భార్య హాజిరా(అ)ను నిర్మానుష్య ప్రదేశంలో ఎడారి ప్రాంతంలో వదిలి రావాలనే దైవాజ్ఞ అయింది. భర్తకు తగిన భార్యగా విశ్వప్రభువుపై విశ్వాసంతో హాజిరా(అలైహస్సలామ్) ఆ పసిబిడ్డతో ఒంటరిగా నివసించసాగారు. కొన్ని రోజుల తర్వాత ఆహారం, నీరు అయిపోగా పసిబిడ్డతో సహా ఆమె ఆకలిదప్పులతో అలమటించసాగారు. ఎవరైనా బాటసారులు కనబడతారేమో అని సఫా, మర్వా కొండల మధ్య ఏడుసార్లు పరుగులు తీశారు. ఈ సంఘటన జ్ఞాపకార్థమే హజ్ యాత్రికులు ఈ రెండు కొండల మధ్య పరుగెత్తుతూ సయీ చేస్తారు. దైవం చేసే ప్రతి కార్యంలోనూ లోక కళ్యాణం నిగూఢంగా ఉంటుంది. హజ్రత్ హాజిరా(అ) చూపిన విధేయత, సహనాలకు బహుమానంగా పసిబిడ్డ ఇస్మాయీల్(అ) కాలితో నేలను కొడుతున్న ప్రదేశం నుండి స్వచ్ఛమైన నీటి ఊట అకస్మాత్తుగా ఉబికి వచ్చింది. ఆ అద్భుతమైన జలధారే నేడు హజ్ యాత్రికులు అతి పవిత్రంగా భావించే జమ్‌జమ్ జలం.

ఈనాటి ముస్లిములందరికీ జమ్‌జమ్ జలం ప్రాధాన్యత విదితమే. ఆనాడు ఇబ్రాహీమ్(అ) తన భార్యాబిడ్డలను వదలివెళ్ళిన నిర్మానుష్య ప్రదేశమే నేటి మక్కా పవిత్ర నగరం.

ఒకరోజు తన ముద్దుల తనయుణ్ని దైవమార్గంలో త్యాగం చేస్తున్నట్లుగా కలగన్నారు. ప్రవక్తల కలలు దైవాజ్ఞకు చిహ్నాలు. ఇబ్రాహీమ్(అ) తన కుమారుడు ఇస్మాయీల్(అ)తో ఇలా అన్నారు: "కుమారా! నేను నిన్ను జిబహ్ (బలి) చేస్తున్నట్లు కలలో చూశాను. ఇక నీ అభిప్రాయమేమిటో చెప్పు". ఆయన ఇలా అన్నారు: 'నాన్నగారూ! మీకు ఆజ్ఞాపించబడిన దానిని నెరవేర్చండి. అల్లాహ్ సంకల్పిస్తే మీరు నన్ను సహనశీలునిగా చూస్తారు'. చివరకు వారు ఉభయులూ (దైవాజ్ఞను) శిరసావహించారు. ఇబ్రాహీమ్(అ) తన తనయుణ్ణి బోర్లా పరుండబెట్టారు. అప్పుడు మేము అతనిని పిలిచి ఇలా అన్నాము: "ఇబ్రాహీమ్! నీవు కలను నిజం చేసి చూపించావు. సత్కార్యం చేసేవారికి మేము ఇలాంటి ప్రతిఫలాన్నే ఇస్తాము. నిశ్చయంగా ఇది ఒక స్పష్టమైన పరీక్ష. మేము ఒక పెద్ద ఖుర్బానీని పరిహారంగా ఇచ్చి ఆ బాలుణ్ణి విడిపించుకున్నాము. అతని కీర్తి, ప్రతిష్టలు తరువాతి తరాల వారిలో శాశ్వతంగా నిలిచిపోయేలా చేశాము' (అస్ సాఫ్ఫాత్: 101-110) అని సృష్టికర్త అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్ ద్వారా వివరించటం జరిగింది.

ఈ మహత్తర సంఘటన భక్తి, విశ్వాసాలకు ప్రతీకగా జ్ఞప్తికి ఉండాలని దివ్య ఖుర్‌ఆన్ స్పష్టంగా ప్రకటించింది.'వాటి (ఖుర్బానీ పశువుల) మాంసంగాని, రక్తంగాని అల్లాహ్‌కు చేరవు. మీ భక్తి పరాయణత మాత్రమే ఆయనకు చేరుతుంది (అల్ హజ్ : 37) అని దివ్య ఖుర్‌ఆన్ బోధిస్తుంది. దైవమార్గంలో అవసరమైతే ధన, ప్రాణ త్యాగాలకు వెనుదీయమన్న సంకల్పాన్ని ప్రకటించే చిహ్నం ఖుర్బానీ.

ఖుర్బానీ అంటే సమర్పణ, సామీప్యం, త్యాగం అనే అర్థాలు ఉన్నాయి. ఇబ్రాహీమ్(అ) చూపిన అనన్య త్యాగాలను స్మరించుకుంటూ ఖుర్బానీ ఇవ్వాలి. ఆచారంగా కాదు ఆరాధనగా భావించాలి. (ఓ ముహమ్మద్!) ఇలా అను: 'నా నమాజ్, నా సకల ఉపాసనా రీతులు, నా జీవనం, నా మరణం, సమస్తమూ సకల లోకాల ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు ఏ భాగస్వామి లేడు. ఈ ఆజ్ఞయే నాకు ఇవ్వబడింది. అందరికంటే ముందు విధేయతతో తలవంచే వాణ్ణి నేనే' (అన్‌అమ్ : 162) విధేయత గురించి ప్రకటించటం జరిగింది. దృఢ విశ్వాసిగా మారటానికి మరణానంతర జీవితం ఉందని తప్పక విశ్వసించాలి. ఈనాటి సమాజంలో జరిగే అన్ని రకాల అన్యాయాలకు, దౌర్జన్యాలకు మూల కారణం మరణానంతర జీవితాన్ని విశ్వసించక పోవటమే. ఇబ్రాహీమ్(అ) అల్లాహ్‌ను మరణానంతరం ఎలా లేపబడతామో చూపించాలని ప్రార్థించారు. నీకు విశ్వాసం లేదా? అని అడిగాడు. ఇబ్రాహీం(అ) వినయంగా ఇలా అన్నారు : నాకు విశ్వాసం అయితే ఉంది. కాని మనసును తృప్తి పరచటం కోసం అడుగుతున్నాను. 'అప్పుడు అల్లాహ్ చెప్పాడు: "సరే మంచిది. నాలుగు పక్షులను తీసుకో. వాటిని బాగా మచ్చిక చేసుకో; తరువాత ఒక్కొక్క దాని భాగాన్ని ఒక్కొక్క కొండపై పెట్టి రా. మళ్ళీ వాటిని రమ్మని పిలువు. అవి నీ వద్దకు పరుగెత్తుకుంటూ వస్తాయి. అల్లాహ్ సర్వశక్తిమంతుడు. సర్వజ్ఞుడు అని బాగా జ్ఞాపకం ఉంచుకో" (2: 260). ఈ సంఘటన ద్వారా మృతులు తప్పక లేపబడతారని, వారు ఇహలోకంలో చేసిన మంచీ చెడులకు దైవం ఎదుట తప్పక జవాబు చెప్పాలనే విషయం విదితమవుతోంది. మనం ఏమీ కానప్పుడు, లేనప్పుడు ఒక చిన్న నీటి బిందువుగా తల్లి గర్భంలో ఆకారాన్ని ఇస్తూ ఉన్న సృష్టికర్తే, తిరిగి అదేవిధంగా అదే ఆకారంతో తిరిగి లేపటం అసాధ్యమా? ఆలోచించండి! ఇబ్రాహీమ్(అ) జీవన విధానంలోనే జీవన సాఫల్యం ఉంది. ఇహపరలోకాలలో దైవప్రీతిని పొందే జీవన మార్గం ఉంది. ఇబ్రాహీమ్(అ) జీవన సరళినే చిట్టచివరి దైవప్రవక్త ముహమ్మద్(స) ఆచరించి, అనుసరించి చూపిన ధర్మం. కావున మనం ఈ బక్రీదు పండుగ సందర్భంగా హాజీలు హజ్ ఆచరణను పాటించే ప్రతి సంఘటనలో ఇబ్రాహీమ్(అ) జీవితం దర్శనమిస్తుంది. సృష్టికర్త అల్లాహ్ ఇబ్రాహీమ్(అ) చూపిన మార్గంలో నడిచి దైవప్రీతిని పొందే భాగ్యాన్ని ప్రసాదించాలని వేడుకుందాం. (ఆమీన్)



# ఆర్థిక వికేంద్రీకరణ సమాజానికి అవసరం

**అర్షియా**

**ప్రపంచంలో** ధనికులు- పేదల మధ్య గల అంతరం నిరంతరం పెరుగుతోంది. ఇది భారతదేశంలో మరింత తీవ్రంగా ఉంది. ద్రవ్యోల్బణం కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు తీవ్రమైన కష్టాల్లో జీవిస్తున్నారు. ప్రజలు తమ అవసరాలు తీర్చుకోవడానికి తీవ్రమైన శ్రమ పడుతున్నారు. చాలా మంది దారిద్ర్య రేఖ కంటే దిగువన జీవించేందుకు నిర్బంధించబడ్డారు. వారు రోజువారీ ఆహారానికీ ఆసరా లేకుండా గడిపే పరిస్థితిలో ఉన్నారు. నగరాల్లో కూడళ్ల వద్ద భారీగా బిచ్చగాళ్లను చూడవచ్చు.

పేదరికంలో జీవించే 110 కోట్ల మందిలో సగానికి పైగా 18 ఏళ్ల లోపు పిల్లలే. ప్రపంచస్థాయిలో 27.9% పిల్లలు పేదరికంలో జీవిస్తు న్నారు. పెద్దలలో ఇది 13.5% మాత్రమే. ప్రపంచ ఆకలి సూచీలో 127 దేశాలలో భారత్ 105వ స్థానంలో ఉంది, ఇది గంభీరమైన పరిస్థితిని సూచిస్తోంది.

2024 ప్రపంచ ఆకలి సూచీ ప్రకారం భారతదేశ స్కోరు 27.3, ఇది మాంద్యం స్థాయిలో ఆకలిని సూచిస్తోంది. దీనికి విరుద్ధంగా దేశంలో కోటీశ్వరుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. వారి ఆస్తిలో కూడా భారీగా వృద్ధి జరుగుతోంది. యూబీఎస్ బిలియనీర్ అంబిషన్స్ రిపోర్టు ఇది వెల్లడించింది.

ఒక బిలియనీర్ అంటే వారి మొత్తం ఆస్తి ఒక బిలియన్ అమెరికన్ డాలర్లకు సమానంగా ఉండాలి. గత ఏడాదిలో ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్యలో కొంత తగ్గుదల కనిపించింది. చైనాలోనూ బిలియనీర్ల సంఖ్య తగ్గింది. 2024 నాటికి భారత్‌లో బిలియనీర్ల సంఖ్య 185కి పెరిగింది. బిలియనీర్ల విషయంలో అమెరికా, చైనా తరువాత భారత్ మూడవ స్థానంలో ఉంది. భారత బిలియనీర్ల సంపదలో 42% వృద్ధి నమోదు అయ్యింది. 2024 చివరి నాటికి వారందరి సంపద 263% పెరిగింది.

ఈ ఏడాదిలో భారతదేశంలో కొత్తగా 32 మంది బిలియనీర్లు చేరారు. 2015 తర్వాత బిలియనీర్ల సంఖ్య రెట్టింపయింది. భారత్ ప్రపంచంలో నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిన వేళ కుటుంబ వ్యాపారాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. భారత్‌లో 108 లిస్టెడ్ ఫ్యామిలీ బిజినెస్‌లు ఉన్నాయి. ఇది భారత్ ను ప్రపంచ బిలియనీర్ల విభాగంలో మూడవ స్థానానికి తీసుకెళ్లింది. బిలియనీర్ల ఆస్తులు పెరగడం జరుగుతున్నప్పటికీ, ప్రపంచ బిలియనీర్ల సంపద పెరుగుదల తగ్గింది.

మోదీ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు బిలియనీర్ల వ్యాపారాలకు ఊపు ఇచ్చాయి. ఇది భారత్‌ను ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగేలా చేసింది. యూబీఎస్ రిపోర్టు ప్రకారం 2015 నుంచి 2024 వరకు గ్లోబల్ బిలియనీర్ల సంపద 121% పెరిగి 14 ట్రిలియన్ల డాలర్లకు చేరింది.

ప్రపంచంలో బిలియనీర్ల సంఖ్య ఇటీవల 1757 నుంచి 2682కి పెరిగింది. ప్రపంచస్థాయిలో బిలియనీర్ల సంపదలో కేవలం 1 శాతం పెరుగుదల మాత్రమే కనిపించింది. ఇది 2015-2020 మధ్య కాలంతో పోలిస్తే 10% తక్కువ. చైనాలో బిలియనీర్ల సంపద 2.1 ట్రిలియన్ డాలర్ల మేర తగ్గింది. దీనికి ప్రధాన కారణం చైనా ప్రభుత్వం విధించిన కొత్త వ్యాపార ఆంక్షలు. యూబీఎస్ రిపోర్టు ప్రకారం 2030 నాటికి భారత బిలియనీర్ల సంఖ్య చైనాను సమం చేయగలదని అంచనా.

ప్రపంచ ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటూ భారత్ గట్టిగా నిలబడుతోంది. పరిశ్రమల వేగం పెరుగుతోంది. ఇది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉంది. అయితే దేశంలో పేదరికాన్ని నిర్మూలించాలంటే ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సాహం ఇవ్వాలి. ఆరోగ్య, విద్యా రంగాల్లో సంస్కరణల అమలు, సామాజిక భద్రత కల్పించడం ఇందుకు ఎంతో కీలకం. అంతేకాక, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, భూ సంస్కరణల అమలు, ఉపాధి అవకాశాలు పెంచడం అవసరం.

దేశ ఆర్థిక అభివృద్ధి పేదరికాన్ని తగ్గించడంలో కీలకపాత్ర పోషించాలి. దీని కోసం పెట్టుబడులు, ఉత్పత్తి, ఎగుమతులను పెంచాలి. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తూ విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలి. విద్య, ఆరోగ్యం అభివృద్ధికి మెట్టు- పేదరిక నిర్మూలనకు మార్గం. ఇవి ప్రజల జీవితాల్లో మంచి మార్పును తీసుకువస్తాయి. అందరికీ ఉచిత, నాణ్యమైన విద్య, వైద్య సేవలు లభించేటట్లు చూస్తే ఉపాధి పెరిగి పేదరికం తగ్గుతుంది.

ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా పేదరికాన్ని అదుపులోకి తేవచ్చు. ఇందుకు ముఖ్యంగా యువతలో నైపుణ్యాభివృద్ధి అవసరం. ప్రభుత్వం పేదలకు స్వయం ఉపాధి, వ్యాపారాలు ప్రారంభించేందుకు అవసరమైన సహాయం అందించాలి. దేశంలో పేదరిక నిర్మూలనకు అనేక ప్రభుత్వ పథకాలు ఉన్నాయి. అందులో ఆహార భద్రత, ప్రాథమిక సేవలు, ఉపాధి పథకాలు, ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన, ఆయుష్మాన్ భారత్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ముఖ్యమైనవి.

ఈ పథకాల లక్ష్యం దారిద్ర్య రేఖ కంటే దిగువన ఉన్నవారికి ఉపాధి, వైద్య సదుపాయాలు, ఆహార భద్రత కల్పించడమే. స్థూలంగా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు వేసే ప్రణాళికలు ఈ కింది రెండు అంశాలపై ఆధారపడ్డాయి.

1. ఆర్థిక అభివృద్ధి వేగం పెంచడం.

2. పేదరిక నిర్మూలన పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం.

కానీ ధనికుల సంఖ్య పెరుగుతుండటం వల్ల ఆర్థిక అసమానతలు పెరిగి, పేదరిక నిర్మూలన పథకాలు ప్రభావవంతంగా అమలు కాకుండా పోయే అవకాశం ఉంది.

## మంచిని పెంచుదాం... చెడును తుంచుదాం

సమాజంలో తప్పు జరుగుతున్నదని తెలిసినప్పుడు మనం దాన్ని చూడకపోయినా దాన్ని నిలువరించేందుకు ప్రయత్నం చేయాలి. అన్యాయాలకు మొదట్లోనే అడ్డుకట్ట వేయాలి. మనం మంచిగా ఉంటే చాలదు.. మన శక్తి మేరకు సమాజంలో జరిగే అన్యాయాలను అడ్డుకోవాలి. సమాజాన్ని నైతిక రుగ్మతల నుంచి కాపాడటం ఇస్లాం ఆచరించేవారి విధి అని దివ్య ఖుర్‌ఆన్‌లో ఒక తాకీదు జారీ అయ్యి ఉంది. ''విశ్వాసులైన స్త్రీ, పురుషులందరూ ఒకరికొకరు సహచరులు. మేలు చేయమని వారు ప్రజలను ఆదేశిస్తారు. ప్రజలను చెడు పనులు చేయకుండా వారిస్తారు'' అని అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో సెలవిచ్చాడు (9: 71). అలా చేయకపోతే అల్లాహ్ వారికి ఏదైనా శిక్షను అమలు చేయొచ్చని కూడా ఆయన హెచ్చరించాడు. మంచిని పెంచే, చెడును నిర్మూలించే బాధ్యతను నిర్వర్తించినంత కాలం ముస్లిం సమాజం నైతిక రుగ్మతలకు గురి కాకుండా సురక్షితంగా ఉంది. చెడు పట్ల కనీసం మనసు లోపల నిరసన భావం కలిగి ఉండటం విశ్వాసానికి తార్కాణం. మనం ప్రపంచంలో ఎక్కడ జీవిస్తున్నా, ఏ స్థితిలో ఉన్నా సత్యాన్నే మాట్లాడాలి. ధర్మానికి సంబంధించిన ఆదేశాలను తప్పకుండా పాటించాలి. పాలకులు నిరంకుశులైనా ధర్మ విరుద్ధ ఆదేశాలు ఇవ్వనంత వరకు ప్రజలు వారికి విధేయత చూపాల్సిందే! అదే సమయంలో పాలకుల దురాగతాలను సమర్థించడం పాపం అవుతుంది. 'నిరంకుశుడైన రాజు ముందు న్యాయం గురించి మాట్లాడటం అత్యుత్తమ జిహాద్' అని దైవప్రవక్త(స) బోధించారు.

**- నసీమ్ సుల్తానా**





## నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

జపాన్‌ను అధిగమించి భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్టు నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మనదిప్పుడు 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అని చెప్పారు. అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే మనకంటే ముందున్నట్టు పేర్కొన్నారు. మరో రెండున్నర, మూడేండ్లలో భారత్ మూడో స్థానానికి చేరుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెండో విడత ఆస్తుల నగదీకరణ కార్యక్రమం ఉంటుందని, దీనిని ఆగస్టులో ప్రకటిస్తామని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

## 'మైసూరుపాక్' పేరు మార్చొద్దు!

'మైసూరు పాక్' పేరును మార్చడంపై దాని సృష్టికర్త ముని మనుమడు అభ్యంతరం వ్యక్తం చేశారు. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో పాక్‌ను గుర్తు చేసే పేర్లను భారతీయులు ఇష్టపడటం లేదు. ఓ మిఠాయి దుకాణం యజమాని మైసూర్ పాక్‌ను మైసూర్ శ్రీగా మార్చారు. దీనిపై మైసూరుపాక్ మొదట తయారు చేసిన కకాసుర మడప్ప ముని మనుమడు నటరాజ్ మీడియాతో మాట్లాడుతూ దీనిని మైసూరు పాక్ అనే పిలవాలని చెప్పారు. మైసూరులో మొదటిసారి దాన్ని తయారు చేశారు. పాక అంటే కన్నడంలో చక్కెర లేదా బెల్లంతో తయారు చేసిన తినుబండారం అని అర్థం ఉండటం వల్ల దానికి మైసూరుపాక్ అనే పేరు వచ్చిందన్నారు.

## అప్రమత్తంగా ఉండి.. జాగ్రత్తలు తీసుకోవాలి: ఐసిఎంఆర్ చీఫ్



ప్రపంచదేశాలను గడగడలాడించిన కోవిడ్ (Covid-19) మళ్లీ భారత్‌లో వ్యాపిస్తోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 1009 క్రియాశీల కేసులు ఉన్నాయి. వారం వ్యవధిలో 750 మంది కొత్తగా కరోనా సోకిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అయితే ఈ నేపథ్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసిఎంఆర్) (ICMR) డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బాహల్ కీలక సూచనలు చేశారు. కరోనా కొత్త వేరియంట్ల పట్ల ప్రజలు భయాందోళన పడాల్సిన అవసరం లేదని చెప్పిన ఆయన.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వం, ఇతర ఏజెన్సీలు ప్రస్తుత పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాయని తెలిపారు. తన అభిప్రాయం ప్రకారం ప్రాథమిక జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు. ఎవరైనా క్యాన్సర్ రోగులు, రోగనిరోధక శక్తి సంబంధిత సమస్యలు ఉన్నవారైతే.. ఎలాంటి ఇన్‌ఫెక్షన్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఐసిఎంఆర్ చీఫ్ సూచించారు.

## వక్ఫ్ చట్టంపై పిటిషన్లు.. మధ్యంతర ఉత్తర్వులపై తీర్పును రిజర్వ్ చేసిన సుప్రీం..!

వక్ఫ్ (సవరణ) చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు మరోసారి విచారించింది. పిటిషన్లతో పాటు కేంద్రం వాదనలు విన్న సర్వోన్నత న్యాయస్థానం మూడు కీలక అంశాలపై మధ్యంతర ఉత్తర్వులను రిజర్వ్ చేసింది. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న పిటిషనర్ల తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, రాజీవ్ ధావన్, అభిషేక్ మను సింఘ్వీల వాదనలను సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం దాదాపు మూడు రోజుల పాటు విని తీర్పును రిజర్వ్ చేసింది. పిటిషనర్ల తరపున హాజరైన కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ రాజ్యాంగ సూత్రాలను విస్మరించారన్నారు. వక్ఫ్ అనేది దేవునికి అంకితమని, మరణానంతర జీవితం కోసంచేసే దానం అని అన్నారు. ఇతర మతాల మాదిరిగా కాకుండా, వక్ఫ్ అనేది దేవునికి చేసే దాతృత్వం అని వివరించారు. ఈ చట్టం వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఓ మార్గమన్నారు. పిటిషనర్లు మూడు కీలక అంశాలపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వక్ఫ్ బై కోర్ట్స్, వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ బై డీడ్‌గా ప్రకటించిన ఆస్తులను డీనోటిఫై చేసే అధికారం ఈ మూడు అంశాలలో ఒకటి. రాష్ట్ర వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ కూర్పునకు సంబంధించినది రెండో అంశం. ఎక్స్ అఫిషియో సభ్యులు తప్ప మిగిలిన సభ్యులందరూ ముస్లింలే ఉండాలన్నది పిటిషనర్ల వాదన. ఇక మూడవది.. వక్ఫ్ ఆస్తా లేక ప్రభుత్వ ఆస్తా అన్న విషయాన్ని నిర్ధారించడానికి కలెక్టర్ విచారణ చేపట్టిన తర్వాత ఆ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధనను పిటిషనర్లు వ్యతిరేకిస్తున్నారు.




## గాజాను తక్షణమే ఆదుకోండి.. పోప్ లియో విజ్ఞప్తి

యుద్ధంలో దెబ్బతిన్న గాజాలో మానవతా సహాయం అందించాలని పోప్ లియో XIV పిలుపునిచ్చారు, అక్కడ పూర్తి దిగ్బంధనం తీవ్రమైన ఆహారం, ఔషధ కొరతకు దారితీసిందని మానవతా సంస్థలు చెబుతున్నాయి. "గాజా స్ట్రిప్‌లో పరిస్థితి ఆందోళనకరంగా, బాధాకరంగా ఉంది" అని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో తన మొదటి వారపు సాధారణ సమావేశంలో పోప్ అన్నారు. "తగినంత మానవతా సహాయం ప్రవేశించడానికి అనుమతించాలని, శత్రుత్వాలను అంతం చేయాలని నేను నా హృదయపూర్వక విజ్ఞప్తిని పునరుద్ఘాటిస్తున్నాను" అని ఆయన అన్నారు. మే 8న కాథలిక్ చర్చి మొదటి US పోప్‌గా ఎన్నికైన లియో, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో కాల్పుల విరమణకు పిలుపునిస్తూ ఇప్పటివరకు శాంతిని తన పోప్ పదవికి ఇతివృత్తంగా చేసుకున్నారు.

## పక్షుల్లోనూ దీర్ఘకాల మైత్రి

మనుషులు తరచుగా ఒకరికొకరు సహకరించుకోవడం సర్వ సాధారణమే. బంధుత్వం, పరస్పర సంబంధం లేకున్నా ఈ సహకారం కనిపిస్తూనే ఉంటుంది. ఇలాంటి సహకారం జంతువుల మధ్య కూడా ఉంటుందని నిరూపించడం చాలా కష్టం. కానీ, మనుషుల మాదిరిగా కొన్ని రకాల పక్షులు సైతం పరస్పరం సహకరించుకుంటాయని తాజా అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనంలో భాగంగా ప్రొఫెసర్ డస్టిన్ రుబెన్‌స్టెయిన్ ల్యాబ్ మాజీ పీహెచ్‌డీ విద్యార్థి అలెక్సిస్ ఎర్ల్ నేతృత్వంలోని పరిశోధకుల బృందం ఏకంగా 20 ఏండ్లపాటు ఆఫ్రికన్ స్టార్లింగ్ పక్షుల తీరును పరిశీలించింది. మానవుల మాదిరిగానే ఆ పక్షులు కూడా ఒకదానికొకటి సహకరించుకుంటాయని, సాటి పక్షికి సాయపడితే దాని నుంచి భవిష్యత్తులో తనకూ సాయం అందుతుందన్న అవగాహనతో ఆఫ్రికన్ స్టార్లింగ్స్ మధ్య పరస్పర సహకారం కొనసాగుతుందని ఈ పరిశీలనలో తేలింది. స్టార్లింగ్ సమూహాలు కేవలం సాధారణ కుటుంబాలు మాత్రమే కాదని, అవి చాలా సంక్లిష్టమైనవని, వాటి మధ్య సంబంధం ఉన్నా, లేకున్నా మనుషుల మాదిరిగా దీర్ఘకాల మైత్రితో కలిసే జీవిస్తూ పరస్పరం సహకరించుకుంటాయని రుబెన్‌స్టెయిన్ వివరించారు.

## రష్యాలో 18 ఏండ్ల లోపు పిల్లలకు ఎనర్జీ డ్రింక్స్‌పై నిషేధం

ఎనర్జీ డ్రింక్‌లను తాగడం వల్ల బాలలకు గుండె జబ్బుల ముప్పు ఉంటుందని అధ్యయనాలు వెల్లడించినట్లు రష్యా హెచ్చరించింది. 18 ఏళ్ల లోపు వయసు గలవారు వీటిని తాగరాదని తెలిపింది. ఈ మేరకు ఓ చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టాన్ని ఉల్లంఘించే వారికి భారీ జరిమానా విధించనున్నట్లు తెలిపింది. అదేవిధంగా ఈ చట్టాన్ని ఉల్లంఘించే అధికారులకు కూడా భారీ జరిమానా విధిస్తామని పేర్కొంది.

## బంగ్లాదేశ్‌లో ఎన్నికలు ఎప్పుడంటే..

రాజకీయ అనిశ్చితిలో ఉన్న బంగ్లాదేశ్లో మరోసారి నిరసనలు కొనసాగుతున్నాయి. ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్లు వెల్లువెత్తున్నాయి. వీటిపై ఆ దేశ తాత్కాలిక సారథి మహమ్మద్ యూనిస్ తాజాగా మాట్లాడారు. తమ దేశంలో ఎన్నికలు ఈ ఏడాది డిసెంబర్- 2026 జూన్ మధ్య జరగొచ్చని చెప్పారు. కొన్ని సంస్కరణలు చేపడుతున్నామని, అవి పూర్తయిన తర్వాత ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. జపాన్ రాజధాని టోక్యోలో జరిగిన ఓ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు . గత ఏడాది రిజర్వేషన్లపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో వందల మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దాంతో ఆ సమయంలో ప్రధానిగా ఉన్న షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేయాల్సివచ్చింది. ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో ఆమె దేశం విడిచి, భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందుతున్నారు. ఆమె రాజీనామాతో బంగ్లాలో అవామీ లీగ్ ప్రభుత్వం పడిపోయింది. ప్రస్తుతం మహమ్మద్ యూనిస్ సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం కొనసాగుతోంది.

## సగం మానవాళిపై యుద్ధ ప్రభావం.. 50 దేశాల్లో సంక్షోభ పరిస్థితులు

ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలు, ఘర్షణలు తీవ్రమవుతున్నాయి. రష్యా-ఉక్రెయిన్, హమాస్-ఇజ్రాయెల్ యుద్ధాలు మొదలుకొని, మయన్మార్ అంతర్యుద్ధం, భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల వరకు.. ప్రపంచవ్యాప్తంగా సుమారు 50 దేశాలు యుద్ధ/ఘర్షణాత్మక పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. దీంతో భూమిపై దాదాపు సగం మానవాళి యుద్ధ సంక్షోభ పరిస్థితులను చవిచూస్తున్నదని తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. గత ఏడాది కాలంలోనే 50 దేశాల్లోని 130 కోట్ల మంది ప్రజలు సాయుధ ఘర్షణల ప్రభావానికి గురైనట్టు స్వతంత్ర, లాభాపేక్ష లేని సంస్థ 'ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్ లొకేషన్, ఈవెంట్ డాటా' (ఏసీఎల్ఈడీ) తాజా నివేదికలో వెల్లడించింది. ఈ యాభై దేశాలకు గాను 10 దేశాల్లో అత్యంత విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని, 20 దేశాల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయని తెలిపింది. '2024లో అత్యంత ప్రమాదకర సంక్షోభంలోకి పాలస్తీనా కూరుకుపోయింది. మయన్మార్‌లో సుమారు 170 సాయుధ గ్రూపులు క్రియాశీలంగా ఉన్నాయి. ఉక్రెయిన్‌లో భీకర పోరు సాగుతున్నది. ఇక 2025లో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ తారస్థాయికి చేరాయి' అని ఏసీఎల్ఈడీ పేర్కొన్నది.

# విటమిన్-డి

## సూర్యరశ్మి ప్రభావంపై అవగాహన

- పోలంకి విజయభాస్కర్

**మన శరీరంలో** బహుముఖమైన విధులను నిర్వహిస్తోంది 'డి' విటమిన్. 'డి' విటమిన్ శరీరంలోని, ఎముకలలోని ఖనిజాల సమతుల్యతను కాపాడటంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఇటీవలి పరిశోధనలలో మధుమేహం, కరోనరి గుండె వ్యాధి, అధిక రక్తపోటు, క్షయ మొదలైన వ్యాధుల నివారణలో కూడా ప్రాముఖ్యం వహిస్తున్న దని వెల్లడైంది.

విటమిన్ 'డి' ఎముకల ఎదుగుదలకు, కండరాల పటుత్వానికి, రోగ నిరోధక శక్తికి, శరీరానికి కాల్షియం అందించడానికి దివ్య ఔషధం. మన దేశంలో దాదాపు అన్ని ప్రాంతాల్లో సూర్యరశ్మి (ఎండ) ఎక్కువగా ఉండటం వల్ల మన దేశస్తులలో విటమిన్-డి లోపం తక్కువ అని లోగడ అనుకునేవారు. కానీ నేడు మన దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలలో, అన్ని వయసుల వారిలోనూ, పసిపిల్లలు, స్కూలు పిల్లలు, గర్భిణీలు, పెద్దలు... ఇలా అందరిలోనూ సుమారు 70 నుంచి 85 శాతం మందిలో విటమిన్-డి లోపం ఉన్నదని వెల్లడైంది. మన దేశంలో ప్రతి నలుగురిలో ఒకరు విటమిన్-డి లోపంతో బాధపడుతుంటారని వైద్య పరిశోధకులు వెల్లడించారు. అందుకే శరీరంలో విటమిన్-డి సమృద్ధిగా ఉన్నవారిని ఆరోగ్య వంతులుగా పరిగణించవచ్చు.

మన దేశీయుల చర్మం నల్లరంగులో ఉండటం, ప్రజల్లో చాలామందికి తగినంత ఎండ తగలకపోవడం, శాకాహారపు అలవాట్లు, ప్రజల ఆహారాన్ని విటమిన్-డితో పటిష్టపరిచే కార్యక్రమం పెద్దగా లేకపోవడం మొదలైనవి విటమిన్-డి లోపం ఎక్కువగా కనిపించ డానికి కారణాలు. విటమిన్-డి లోపంతోపాటు ఆహారంలో కాల్షియం లోపం, ఫిట్స్, క్షయ మొదలైన వ్యాధులకు వాడే ఔషధాల వల్ల స్టిరాయిడ్స్ మందులను వివిధ వ్యాధులలో వాడుతుండటం వల్ల విటమిన్-డి లోపం ఏర్పడి రికెట్స్, ఆస్టియో, మైలేషియా అనే వ్యాధులకు దారి తీస్తున్నదని వైద్యులు వెల్లడించారు. సూర్యరశ్మి వల్ల చర్మంలో విటమిన్-డి ఉత్పత్తి అవుతుంది. ఈ విటమిన్-డి ప్రకృతి సిద్ధంగా కాడ్ లివర్ నూనెలోను, ఫిష్ లివర్ నూనెలోను ఉంటుంది. మాంసాహారాలలోనూ, చేప, కోడి గుడ్లు, పాలలోనూ... విటమిన్-డి సమృద్ధిగా ఉంటుంది.

చర్మంలో ఉండే అచేతనమైన విటమిన్-డి నుండి చైతన్యవంతమైన డి-3 రూపంలోకి సూర్యరశ్మిలోని అల్ట్రా వయోలెట్ లైట్ వల్ల పరివర్తన చెందుతుంది. చర్మంలో ఉండే మెలనిన్ అనే వర్ణకం ఈ ప్రక్రియను నిరోధించే అవకాశం ఉన్నందువల్ల, నల్లని చర్మం ఉన్న వ్యక్తుల్లో విటమిన్-డి లోపం కలుగుతుందని చెప్పవచ్చు. ఎముకల్లో ఖనిజీకరణ జరగాలంటే... ఎముకల్లో తగినంత కాల్షియం, ఫాస్పేట్ ఉండాలి. విటమిన్-డి వల్ల ప్రేగుల నుండి కాల్షియం, ఫాస్పరస్ రక్తంలోకి పీల్చుకోబడతాయి. ఎముకల ఖనిజీకరణ ప్రక్రియ లోపాల వల్ల ఆస్టియోమైలేషియా, రికెట్స్ వ్యాధులు కలుగుతాయి.

పెరుగుతున్న పిల్లల అస్తిపంజరంలో లోపాలు ఉంటే రికెట్స్ గాను, అదే వ్యాధి పెద్దల్లో వస్తే ఆస్టియో మైలేషియా గాను పిలుస్తారు. మన దేశంలో ఈ రెండు వ్యాధులకు ప్రధాన కారణం ఆహారంలో విటమిన్-డి లోపం ఉండటమే.

### వ్యాధి లక్షణాలు

పసిపిల్లల్లో కండరాలు బిగువు తగ్గిపోవడం, ఆహారం తీసుకోవడానికి ఇబ్బంది, చికాకుగా ఉండటం, వంపులు రావచ్చు. వ్యాధి ముదిరిన తరువాత నడవలేకపోవడం, పెరుగుదల తగినంతగా లేకపోవడం, ఎముకలు పగలటం వంటి లక్షణాలు ఉండవచ్చు. పిల్లల్లో మోకాళ్ళ ప్రాంతంలో కాళ్ళు బయటికి వంగి ఉండటం, ఛాతీ ముందు భాగంలో ఉండే ఎముకలు మెత్తబడటం, గూని రావటం మొదలైన లక్షణాలు ఉండవచ్చు. పెద్దల్లో కొంత మందిలో ఏ లక్షణాలూ ఉండకపోవచ్చు. అయితే ఎముకల నొప్పులు, కొద్ది దెబ్బలకే ఎముకలు విరగడం జరగవచ్చు. మధుమేహం, గుండె జబ్బులు, అధిక రక్తపోటు, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, క్షయ మొదలైన వ్యాధుల విస్తరణకు దోహదపడుతున్న పలు కారణాల్లో విటమిన్-డి లోపం కూడా ఒకటని ఇటీవల జరుగుతున్న పరిశోధనల్లో వెల్లడైంది.

### నివారణ

ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ మంది ప్రజలు విటమిన్-డి లోపంతో బాధపడుతున్నారు. మన దేశ వాతావరణంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ భారతీయుల్లో ఎక్కువ మందిలో విటమిన్-డి లోపం ఉన్నదని గ్రహించి అవగాహన చేసుకోవాలి.

ప్రతి ఒక్కరూ ఉదయం కనీసం ఒక అరగంట సేపు ప్రత్యక్షంగా శరీరానికి ఎండ బాగా తగిలేలా చూసుకోవాలి. ఇకపోతే... చివరగా మన దేశంలో ఆహారంలో విటమిన్-డిను పొందుపరిచే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**